www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -151 సోమవారం14 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545



పాఠకులకు ప్రకటనకర్తలు శ్రేయోభిలాషులకు

## వినాయకచవితి శుభాకాంక్షలు

నేడు వినాయకచవితి పర్వదినం సందర్భంగా పత్రికా కార్యాలయానికి సెలవు. కావున రేపు (మంగళవారం 15-9-2026) సంచిక వెలువడదు .. (పునర్దర్శనం బుధవారం )

# టెక్నాలజీపై గుత్తాధిపత్యం ప్రమాదకరం



**సాంకేతికతను, క్రిటికల్ మినరల్స్‌ను ఆయుధాలుగా వాడటం ప్రపంచానికే ముప్పు**

**బ్రిక్స్ సదస్సు ముగింపు కార్యక్రమంలో మోదీ**

**క్రిటికల్ మినరల్స్ సరఫరాపై చైనా నియంత్రణ**

**ఆ దేశాధ్యక్షుడి సమక్షంలోనే ప్రధాని వ్యాఖ్యలు**

**గ్లోబల్ సౌత్‌కు బ్రిక్స్ కూటమే బలమని వెల్లడి**

**న్యూఢిల్లీ సెప్టెంబర్ 13,(ప్రజావినికిడి):** కీలక ఖనిజాలను ఆయుధాలుగా మారిస్తే అభివృద్ధికి ఆటంకాలు ఎదురవుతాయని ప్రధాని నరేంద్ర మోడీ బ్రిక్స్ సభ్యదేశాలను హెచ్చరించారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనప్పటికీ వాటిని తట్టుకొని నిలబడే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు. న్యూఢిల్లీలోని భారత మండపంలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సమావేశంలో ఆయన ఆదివారం ప్రసంగిస్తూ 'సాంకేతిక తను, కీలక ఖనిజాలను ఆయుధాలుగా మార్చడం మన పురోగతికి ఆటంకం కలిగిస్తుంది. మిగతా2లో...

## పల్నాడు జిల్లాలో విషాదం .. పిడుగుపాటుకు నలుగురు మృతి



2లో

## ఆసియా కప్ గెలిచిన టీమిండియా



**శ్రీచరణి స్పిన్ మ్యాజిక్..**

**8వ సారి ఆసియా కప్ గెలిచిన టీమిండియా**

**మహిళల ఆసియా కప్ 2026 ఫైనల్లో శ్రీలంకపై భారత్ ఘన విజయం**

**ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధనల మెరుపు అర్ధశతకాలు**

**బంతితో అద్భుతం చేసిన యువ బౌలర్ శ్రీ చరణి.. 4 వికెట్లతో రాణించిన వైనం**

**72 పరుగుల భారీ తేడాతో గెలిచి టైటిల్‌ను కైవసం చేసుకున్న టీమిండియా**

**భారత్ నిర్దేశించిన 184 పరుగుల లక్ష్య ఛేదనలో 111 పరుగులకే కుప్పకూలిన లంక**

**న్యూఢిల్లీ సెప్టెంబర్ 13(ప్రజావినికిడి):** మహిళల ఆసియా కప్ 2026 ఫైనల్లో భారత జట్టు అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. దుబాయ్ వేదికగా జరిగిన తుది పోరులో శ్రీలంకను 72 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసి రికార్డు స్థాయిలో 8వ సారి ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (68), స్మృతి మంధన (59) బ్యాటింగ్‌లో విధ్వంసం సృష్టిస్తే, యువ బౌలర్ శ్రీ చరణి (4/20) బంతితో మాయ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. మిగతా2లో...

# ఐక్యంగా ఉంటేనే మీకు కోటా..వాటా..



**సీఎంలంతా గల్లాపెట్టె రోశయ్యకే.. ఇచ్చారు.. గాంధీజీ మీ వాడే: రేవంత్**

**ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన**

**సీఎం మాటల్లోనే కఠినత్వం.. చేతల్లోనూ ఉంటే ఎంతో మంది జైలుకెళ్లేవారు: టీజీ వెంకటేశ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 13,(ప్రజావినికిడి):** ఆర్యవైశ్యులంతా సమైక్యంగా ఉండాలని, పోటీ ప్రపంచంలో సవాళ్లను ఎదుర్కోవ డానికి సిద్ధం కావాలని సీఎం రేవంత్ అన్నారు. సమయస్ఫూర్తితో రాజకీయాల్లో కోటా, వాటా దక్కించుకోవాలని సూచించారు. అందరూ ఒక్కతాటిపై నడిస్తే వారిని గౌరవించనివారు ఉండరని పేర్కొన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి మిగతా2లో...

# పదవి అలంకారమే.. ప్రజల కోసం పనిచేస్తా...

మాజీ మంత్రి కొండా సురేఖ



2లో

## మెగా డీఎస్సీలో భారీ స్కామ్..




**- కూటమి సర్కారుపై వైఎస్ జగన్ మళ్లీ ఫైర్**

**అమరావతి సెప్టెంబర్ 13,(ప్రజావినికిడి):** టీడీపీ ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ స్కామ్ జరిగిందంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మరోసారి మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు. ఓ అభ్యర్థి విషయంలో జరిగింది సరైన, పారదర్శక విధానమేనా..? అని ముఖ్యమంత్రి చంద్రబాబును మిగతా2లో...


# (టెట్) జూన్ 2026 ఫలితాలు విడుదల

**ఏపీ టెట్-2026 జూన్ ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్**

**ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల్లో 51%, సాధారణ అభ్యర్థుల్లో 47 శాతం మంది ఉత్తీర్ణత**

**అధికారిక వెబ్‌సైట్, వాట్సాప్ నంబర్ ద్వారా ఫలితాలను తెలుసుకునే అవకాశం**

**ఉత్తీర్ణులైన వారికి శుభాకాంక్షలు, అర్హత సాధించని వారికి ధైర్యం చెప్పిన లోకేశ్**



**అమరావతి సెప్టెంబర్ 13(ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు శుభవార్త. ఏపీ టెట్-2026 జూన్ కు సంబంధించిన ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం విడుదల చేశారు. ఈ పరీక్షలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు 51 శాతం ఉత్తీర్ణత సాధించగా, సాధారణ అభ్యర్థులు 47 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వెల్లడించారు. మిగతా2లో...

# పండుగ రోజే విచారణకు పిలుపు!

● కేటీఆర్ పీఏ, పీఆర్వోకు పోలీసుల నోటీసులు ● రేవంత్ సర్కార్ కక్షపూరిత ధోరణికి ఇదే నిదర్శనం



2లో

# 2029 కల్లా ఎన్డీయే రాష్ట్రాల్లో యూసీసీ అమలు

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13,(ప్రజావినికిడి):** వచ్చే లోక్‌సభ (2029) ఎన్నికల లోపు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే రాష్ట్రాల్లో యూసీసీ (ఉమ్మడి పౌరస్మృతి)ని అమలుజేయబోతున్నట్టు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. బీజేపీ పాలనలో ఉన్న 21 రాష్ట్రాల్లో యూసీసీని ప్రవేశపెడుతామని తెలిపారు. ఆదివారం

# ఫ్యూచర్ సిటీలో భారీగా బెల్లం పట్టివేత..



**నాంపల్లి, (ప్రజావినికిడి):** ఫ్యూచర్ సిటీలో లోని ఎక్సైజ్ స్టేషన్ ఇబ్రహీంపట్నం పరిధిలో ఎక్సైజ్ పోలీసులు ఒక ఇంట్లో నిల్వచేసిన 1860 కేజీల బెల్లం 1160 కేజీల ఆలయంలో స్వాధీనం చేసుకున్నారు.పట్టుకున్న బెల్లం విలువ రూ.3 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. ఈ నిల్వచేసిన బెల్లం ఎవరిదైన విషయంపై ఎక్సైజ్ పోలీసులు విచారణ ప్రారంభించారు.

# ఫరూక్ నగర్ మండలం లోని కందివనం, హాజిపల్లి గ్రామలలో గ్రామ కమిటీల నియామకం



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**ఫరుక్ నగర్ మండలం లోని కందివనం, హాజిపల్లి గ్రామాలలో గ్రామ కమిటీలు నియామకం.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామ కమిటీలు ఎవరు బలవంతం మీద కాకుండా,స్వయాన ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,యువకులు,మాజీ అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్ణయించిన వ్యక్తిని మాత్రమే ఎన్నుకోవడం జరిగిందనీ ఆయన అన్నారు.పార్టీకి పని చేసుకుంటూ పోతే పదవులు వాటంతట అవే వస్తాయని, అలాగే పార్టీ బలోపేతమే మన యొక్క ప్రధాన ధ్యేయమని, అందరినీ కలుపుకుంటూ విభేదాలకు పోకుండా పార్టీని ముందుండి నడపాలని గ్రామ కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన హీరు నాయక్,గుండ్రాతి విష్ణు గౌడ్ కు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు,తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసిల ఆత్మ ఘోష మహాధర్నాను జయప్రదం చేయండి

### జిఎస్పి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర



**వాజేడు,సెప్టెంబర్ 13,(ప్రజావినికిడి)**ఆదివారం నాడు వెంకటాపురం మండల ఆర్&బి గెస్ట్ హౌస్ ఆవరణంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిఎస్పి,ములుగు జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిఎస్పి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ, ఎస్టీ,జాబితా నుండి లంబాడీలను తొలగించాలని ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని 18 న హైదరాబాదు ఇందిరా పార్కులోజరిగే ఆదివాసిల ఆత్మఘోష మహాధర్నను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.5వ షెడ్యూల్ భూభాగంలో 1/70 చట్టాన్ని అమలుకై అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు ప్రక్క రాష్ట్రాలలో లంబాడీలు ఓసి బీసీలుగా చలామణి అవుతుంటే తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఎస్టీలుగా ఎలా చలామణి అవుతారని ఆయన ప్రశ్నించారు. 1970 సంవత్సరంలో ఓటు బ్యాంకు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చారని తెలంగాణ రాష్ట్రంలో లంబాడీల ఎస్టి కుల ధ్రువీకరణ పత్రాలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని ఒక ప్రత్యేక కమిషన్ ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని అమలు చేసి ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో తాటి రాజేష్, భీమయ్య, లక్ష్మయ్య,రమేష్, సుక్కయ్య తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణలో లోక్ అదాలత్ సక్సెస్.. సైబర్ బాధితులకు రూ.42 కోట్ల వాపసు

**సెప్టెంబర్ 13,(ప్రజావినికిడి):**
తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించిన మూడో జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 3,896 సైబర్ మోసాల కేసులతో సహా మొత్తం 1.51 లక్షలకు పైగా రాజీపడదగిన (కాంపౌండబుల్) క్రిమినల్ కేసులను పరిష్కరించినట్లు తెలంగాణ పోలీస్ శాఖ ఆదివారం వెల్లడించింది. ఈ సెటిల్‌మెంట్ల ద్వారా సైబర్ నేరాల బాధితులకు ఏకంగా రూ.42.29 కోట్లు తిరిగి అందజేయడం గమనార్హం.రాష్ట్రవ్యాప్తంగా కోర్టులలో కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, కక్షిదారుల సమయం, డబ్బు ఆదా చేసే లక్ష్యంతో ఈ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇరు పక్షాల మధ్య రాజీ, పరస్పర అంగీకారం ద్వారా వివిధ రకాల కేసులను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. ఈ అవకాశాన్ని ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పోలీసులు ప్రోత్సహించారు. ఇందుకోసం పరిష్కారానికి అర్హత ఉన్న కేసులను గుర్తించి, ఇరువర్గాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు.డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సెప్టెంబర్ 3న ప్రారంభమైన కేసుల పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 12న ముగిసింది. ఈ సమయంలో మొత్తం 1,51,164 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 21,843 ఎఫ్ఐఆర్ కేసులు, 1,404 విపత్తు నిర్వహణ కేసులు, 61,052 పెట్టీ కేసులు, 62,969 మోటార్ వాహన చట్టం కేసులు ఉన్నాయి. ప్రత్యేకించి, 3,896 సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం ద్వారా బాధితులకు రూ.42.29 కోట్ల మొత్తాన్ని తిరిగి చెల్లించారు.

# మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్టించండి.. పర్యావరణాన్ని కాపాడండి..

### శ్రీనిధి మహిళా ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ బాపట్ల పుష్పలత..







**హైదరాబాద్,(ప్రజావినికిడి):సెప్టెంబర్ 13:**
పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్టించి భక్తిశ్రద్ధలతో పూజించాలని శ్రీనిధి మహిళా ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ బాపట్ల పుష్పలత అన్నారు.హెచఎండిఏ సహకారంతో హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం( హైదరాబాద్ జిందాబాద్)మరియు శ్రీనిధి మహిళా ఫౌండేషన్ మరియు ప్రజాసంకల్పం స్వచ్ఛంద సంస్థ / ప్రజాసంకల్పం మీడియా ఆధ్వర్యంలో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు గత పది సంవత్సరాలనుండి మట్టి గణపతుల ఉచిత పంపిణి చేస్తున్నాము అని అన్నారు.రామంతాపూర్ చిన్నచెరువు కట్ట కింద భరత్ నగర్ క్రాస్ రోడ్డు లో మరియు ఆర్టీసి కాలనీలో మట్టి విగ్రహాల పంపిణీ చేశారు. ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించే విధంగా అవగాహనా కార్యక్రమాలు చేస్తున్నాము అని అన్నారు.హెచ్ఎండిఏ ప్రతి సంవత్సరం ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నదని అన్నారు.హైదరాబాద్ జిందాబాద్, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (హెచ్ సి ఎఫ్ ) సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ప్రతిష్టించడం వలన నగరంలో హుస్సేన్ సాగర్ మరియు చెరువులు కుంటలు కాలుష్యానికి గురవుతున్నాయని, పర్యావరణానికి హానికరం కాని మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్టించాలని పిలుపు నిచ్చారు. నగరంలో వైభవంగా నిర్వహించుకొనే "వినాయక చవితి" పండుగ సందర్భంగా అందరూ ఇండ్లలోనూ, అపార్ట్‌మెంట్స్, కాలనీ, బస్తీలలో సామూహికంగాను మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్ రాలపల్లి కుసుమ మేడం,సరిత, ప్రజావాణి సంస్థ ఫౌండర్ ఎర్రం శ్రీనివాస్, రవీందర్ రావు, పోలిశెట్టి సత్యనారాయణ,ముదిగొండ శివ ప్రసాద్, సాయి వర్ధన్,మండల శివకుమార్, వెంకటేష్,బాపట్ల కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు భక్తితో జరుపుకుందాం- బాధ్యతతో నిర్వహిద్దాం

**వాజేడు, సెప్టెంబర్ 13,(ప్రజావినికిడి):**
వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని వెంకటాపురం సి.ఐ ముత్యం రమేష్ గణేష్ మండపాల నిర్వాహకులకు సూచించారు.




ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ, గణేష్ మండపాల ఏర్పాటు అలాగే ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. మండపాల నిర్వాహకులు పాటించాల్సిన కొన్ని ముఖ్య సూచనలు ఇవ్వడం జరిగింది.
గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధిత అధికారుల నుండి అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలి.గణేష్ ఉత్సవాలు నిర్వహించదలచిన ప్రతి నిర్వాహకుడు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం తెలంగాణ పోలీస్ అధికారిక లింక్: **https://policeportal.tspolice.gov.in/indeINew1.htm**మండపాల ఏర్పాటు సమయంలో ప్రజల రాకపోకలకు, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.మండపాల వద్ద భద్రతా చర్యలు పాటిస్తూ, నిర్వాహకులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ వైరింగ్, విద్యుత్ కనెక్షన్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలి.
ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎటువంటి చర్యలకు పాల్పడకూడదు.

**డీజేలకు అనుమతి లేదు**

గణేష్ ఉత్సవాల సందర్భంగా డీజే నిర్వహణకు ఎలాంటి అనుమతి లేదని సి.ఐ,ముత్యం రమేష్ స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి డీజేలు నిర్వహించడం, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఉత్సవాల నిర్వహణలో యువత, నిర్వాహకులు భక్తులు సంయమనం పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.భక్తితో వినాయకుడిని ఆరాధిద్దాం బాధ్యతతో ఉత్సవాలను నిర్వహిద్దాం.
ప్రజలకు ఇబ్బంది కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం లేకుండా గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిద్దాం.పోలీస్ శాఖకు సహకరిద్దాం అని పిలుపునిచ్చారు

# భైర్కాన్ పల్లిలో హైమాక్స్ లైట్లని ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**కేశంపేట,(ప్రజావినికిడి):**కేశంపేట మండలం భైర్కాన్ పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ అదేవిదంగా వారి తనయుడు శివ యాదవ్ తమ గ్రామంలో మెరుగైన వెలుతురు కొరకు గ్రామ ప్రజల కోరిక మేరకు హైమాస్ట్ లైట్స్ ఏర్పాటు చేయాల్సిందిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని కోరగా స్పందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వినాయక చవితి లోపు పూర్తి చేయించేలా చూస్తానని మాట ఇవ్వడంతో,ఇచ్చిన మాట ప్రకారం పనులు పూర్తి కావడంతో గ్రామ సర్పంచ్ అలాగే వారి తనయుడు బైకాని శివ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం రోజు గ్రామ ప్రజల సమక్షంలో ఎమ్మెల్సీ ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి తనవంతు కృషి నిరంతరం ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పట్ల ఇంతటి ఉదారతతో స్పందించి,సొంత నిధులు కేటాయించి గ్రామానికి కొత్త కళ తెచ్చిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చొరవపై హర్షం వ్యక్తం చేస్తూ రానున్న రోజుల్లో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి గారు ఉన్నత స్థాయికి వెళ్లాలని మా గ్రామస్థుల సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అనిత రఘునాథ్ యాదవ్ భైర్కాన్ పల్లి బైకని శమంతా యాదయ్య,కేశంపేట సర్పంచ్ బుజ్జం సంతోష శ్రీశైలం యాదవ్,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,లింగం దాన సర్పంచ్ నాగిల వెంకట్,మాజీ ,మాజీ కౌన్సిలర్ ఈశ్వర్ రాజు,ఆలోనిపల్లి శ్రీనివాస్ గౌడ్, కంటెస్టెడ్ కౌన్సిలర్ రాజేందర్ సింగ్,మాజీ సర్పంచులు తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,శేఖర్ పంతులు,యారం శేఖర్ రెడ్డి,ఆంజనేయులు యాదవ్,క్రిష్ణ, జంగయ్య,జై సింగ్,రవి నాయక్, చెవులపలపల్లి కంటెస్టెడ్ సర్పంచ్ సత్యనారాయణ, బోదునంపల్లి కాంటెస్టెడ్ సర్పంచ్ శేఖర్,మాజీ ఎంపిటిసి కోటేశ్వర్, సీనియర్ నాయకులు, ఉపసర్పంచులు, సుదర్శన్ గుప్త,దన్ సింగ్,యారం రామ్ రెడ్డి, సహదేవ్,నాయకులు మల్లేష్, మురళి,జగన్ రెడ్డి, లక్ష్మణ్,క్రిష్ణ,పల్లటి క్రిష్ణయ్య, నాగరాజు, సాయిరాం, అబిశ్రీను, రవి,ప్రకాష్,మని గౌడ్, మల్లేష్, యాదగిరి,శేఖర్, గ్రామ వార్డు సభ్యులు, భైర్కాన్ పల్లి వార్డు సభ్యులు,గ్రామస్తులు మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ప్రజా సమస్యలపై ప్రశ్నించడమే కాళోజీకి నిజమైన నివాళి

**సాహితీ కళాభారతి కవిసమ్మేళనంలో పినపాక ప్రభాకర్ - హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్ కవులు..**






**షాద్ నగర్,(ప్రజావినికిడి):** సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి, ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించడమే ప్రజానాయకుడు, ప్రజాకవి కాళోజీ నారాయణరావుకు ఇచ్చే నిజమైన నివాళి అని కార్మిక సంక్షేమ సంఘం నాయకులు, రచయిత పినపాక ప్రభాకర్ పిలుపునిచ్చారు.

ఆదివారం షాద్‌నగర్ రైల్వే స్టేషన్ రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో 'సాహితీ కళాభారతి' సంస్థ ఆధ్వర్యంలో కాళోజీ జయంతి సందర్భంగా నిర్వహించిన కవిసమ్మేళనంలో ఆయన పాల్గొని తన స్వీయ రచన ప్రశ్నించు..పోరాడు.. సాధించు..

అనే కవితను వినిపించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర కవులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

కాళోజీ కేవలం అక్షరాలను కాగితంపై పేర్చడం నేర్పలేదని,ఆ అక్షరాలకు ప్రజల ఆకలి వాసనను అద్దడం,కష్టాల్లో ఉన్న మనిషి పక్కన నిలబడటం నేర్పారని గుర్తుచేశారు. నిజాం వ్యతిరేక సాయుధ పోరాటం నుండి నిన్నటి స్వరాష్ట్ర ఉద్యమం వరకు, నేటి సిద్ధాపూర్ డంపింగ్ యార్డు, పాలమూరు ప్రాజెక్టులు,డేటా సెంటర్ల పేరుతో మారుతున్న భూ సమీకరణాల వరకు ప్రజల అభిప్రాయాలను విస్మరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అభివృద్ధి అనేది ప్రజల సంక్షేమం కోసమే కావాలని, పేదవాడి కన్నీటి చుక్కే రేపటి తిరుగుబాటుకు మూలవిత్తనమని స్పష్టం చేశారు.

అధికార బెదిరింపులకు భయపడకుండా ప్రజా హక్కుల కోసం ప్రతి ఒక్కరూ గొంతుక విప్పాలని, న్యాయం గెలిచే వరకు ప్రజా పోరాటాలు ఆగని నదిలా సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కవిసమ్మేళనంలో సాహితీవేత్తలు, కవులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ప్రశ్నించు పోరాడు సాధించు**

అన్యాయం ఎదురైతే
నిశ్శబ్దం నా భాష కాదు
ప్రశ్నే నా ఊపిరి.
నోరు మూయమంటే
నా గొంతు మరింత పదునెక్కుతుంది.
భయపడటం నా నైజం కాదు..
సంధించే ప్రశ్న ఏదైనా అది
నా వ్యక్తిగత స్వార్థం కాదు .
ప్రజల గుండెల్లో రగులుతున్న
ధర్మాగ్రహజ్వాల నుండి పుడుతుంది.
అధికారం బెదిరిస్తే
భయం నా అడుగులను వెనక్కి లాగదు.
అధికారం ఎంత ఎత్తయితే,
ప్రజా ప్రశ్న అంత లోతుగా
పాతుకుంటుంది.
పేదవాడి కంటినుంచి జారిన ప్రతి కన్నీటి
చుక్క
రేపటి తిరుగుబాటుకు పడిన
మూలవిత్తనం!
సమాధానం అనే మొలక తొడిగే వరకు
ప్రశ్న ఆగదుడ
పోరాటం అలసిపోదు!
రైతు పొలంలో చిందించే చెమట
ఈ నేల నుదుటిపై రాసిన సత్యం.
కార్మికుడి బిగిసిన పిడికిలి
శ్రమకు మిగిలిన చివరి సంతకం.
ప్రజల కళ్లలో మిగిలిన ఆశ
చీకటిలో ఆరని చివరి దీపం.
అది వెలుగుతున్నంతకాలం
ప్రజా గొంతుక మూగబోదు!
నాటి నిజాం వ్యతిరేక రైతాంగ సాయుధ
పోరాటంమైనాడ మొన్నటి స్వరాష్ట్ర
ఉద్యమమైన,
నేటి సిద్ధాపూర్ డంపింగ్ యార్డు
ఉద్యమమైనాడ
పాలమూరు ప్రాజెక్టులపై ప్రశ్నలైనాడ
డేటా సెంటర్ల పేరుతో మారుతున్న భూమి
జీవన సమీకరణాలైన
స్థానిక నిరుద్యోగ యువత భవిష్యత్తైనాడ
ప్రశ్న ఒక్కటే
ఈ నేల ఎవరిది?
ఈ అభివృద్ధి ఎవరి కోసం?
ఈ నిర్ణయాల్లో
ప్రజల మాట ఎక్కడ?
ఈ ప్రశ్నలకు బదులు దొరకనంతవరకు
ప్రజల గొంతుక
పీఠాలను కదిలించే పెనుగర్జన!
కాళోజీ..నేర్పింది
అక్షరాలను కాగితంపై పేర్చడం కాదు
వాటికి ప్రజల ఆకలి వాసనను అద్దడం.
కష్టాల్లో ఉన్న మనిషి పక్కన నిలబడటం.
అన్యాయం ముందు తలవంచకపోవడం.
నిజం ఒంటరిగా ఉన్నా
దాని వైపే నిలబడి కలెబడడం
ఆయన జయంతికి పూలమాల వేయడం
కాదు..అన్యాయాన్ని ప్రశ్నిద్దాం.
ఒక బాధితుడి కన్నీటిని తుడుద్దాం.
ఒక హక్కు కోసం అడుగు ముందుకు
వేద్దాం.
వేదికపై పలికే మాటల్లో కాదు
ప్రజల మధ్య నిలిచే మన అడుగుల్లో
ఉంది.
ప్రశ్నించే గొంతులు
ఒక్కొక్కటిగా వెలిగే కాగడాలవ్వాలి.
పోరాడే చేతులు
ఒకదానికొకటి అండగా నిలిచే
భుజాలవ్వాలి
న్యాయం గెలిచే వరకు
ప్రజా పోరాటం
ఆగని నదిలా ప్రవహించాలి.
ప్రజలే బలం
ప్రజలే చరిత్ర
ప్రజల పక్షాన ప్రశ్నించడమే
కాళోజీకి నిజమైన నివాళి!

# విగ్రహం తొలగించారు.. గుంతలు పూడ్చడం మరిచారు..!

**చౌరస్తా విస్తరణ మాటలకే పరిమితం..**

**గుంతలు తప్పించుకోవాలా.. ప్రాణాలు కాపాడుకోవాలా? చౌరస్తాలో వాహనదారుల పరిస్థితి..!**

**మున్సిపల్ చైర్మన్, కమిషనర్ స్పందించాలని ప్రజల డిమాండ్..!**



**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** పట్టణ ముఖ్య కూడలిలో వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించిన అధికారులు,అదే ప్రాంతంలో వాహనదారులకు నరకయాతనగా మారిన గుంతలను మాత్రం పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. విగ్రహం తొలగింపుపై ఉన్న శ్రద్ధ.. రహదారిపై ఏర్పడ్డ గుంతలు ఎందుకు కనిపించడం లేదంటూ వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

పరిగి రోడ్డుకు వెళ్లే మార్గంలోనూ,అక్కడి నుంచి వచ్చే మార్గంలోనూ అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి.రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది.గుంతలు తప్పించుకునే క్రమంలో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే షాద్‌నగర్ ప్రధాన చౌరస్తాను విస్తరించాలనే డిమాండ్‌పై అనేక వార్తా కథనాలు వెలువడుతున్నా, చర్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి.చౌరస్తా విస్తరణ ఎప్పుడు జరుగుతుందో తెలియని పరిస్థితి,కనీసం ప్రస్తుతం ఉన్న రహదారికి మరమ్మతులు చేయకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

**అధికారులకు గుంతలు కనపడటం లేదా?**

ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన కూడలిలో ఇంతటి దుస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు ఎందుకు దృష్టి సాధించలేకపోతున్నారని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

**మున్సిపల్ చైర్మన్, కమిషనర్ స్పందించండి..!**

"వాహనదారుల ప్రాణాలు అంటే చెలగాటమా?" అంటూ ప్రజలు మున్సిపల్ చైర్మన్,కమిషనర్ ను ప్రశ్నిస్తున్నారు.తక్షణమే పరిగి రోడ్డు మార్గంలోని గుంతలను పరిశీలించి,అత్యవసర మరమ్మతులు చేపట్టి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

# బోదునంపల్లిలో గులాబీ జోరు..

**కారు స్పీడ్ పెంచిన ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి..!**

**నవీన్‌రెడ్డి సమక్షంలో భారీగా బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ శ్రేణులు**

**కాంగ్రెస్‌కు షాక్..100 మంది నాయకులు,కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరిక**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** నియోజకవర్గంలోని కేశంపేట మండలం బోదునంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి భారీ బలం చేకూరింది. కంటెస్టెడ్ సర్పంచ్ పిప్పల శేఖర్ కురుమ,మాజీ ఉపసర్పంచ్ లింగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 100 మంది నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక పాత్ర పోషించారని అన్నారు. కేసీఆర్ హయాంలో అమలు చేసిన రైతుబంధు,మిషన్ భగీరథ,కల్యాణలక్ష్మి,ఆసరా పెన్షన్లు వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చాయని పేర్కొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు,గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీని ప్రజలు మరోసారి బలపరుస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో కారు పార్టీ మరింత పుంజుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీని నమ్ముకుని పార్టీలోకి వచ్చిన ప్రతి నాయకుడు,కార్యకర్తకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని నవీన్ రెడ్డి భరోసా ఇచ్చారు. బోదునంపల్లి గ్రామంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కొత్త, పాత నాయకులు,కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**నవీన్ రెడ్డి నాయకత్వంపై విశ్వాసంతో చేరికలు**

ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ సమస్యలపై పోరాడుతున్నారని బోదునంపల్లి గ్రామస్థులు పేర్కొన్నారు. ఆయన నాయకత్వంపై ఉన్న నమ్మకంతోనే పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరుతున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆయనకు పూర్తి అండగా ఉంటామని స్పష్టం చేశారు.

కేసీఆర్ ఆశయాల సాధన కోసం, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మార్గదర్శకత్వంలో బోదునంపల్లిలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని గ్రామస్తులు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ లో చేరిన వారు అయినవారు: పిప్పల శేఖర్ కురుమ, వార్డ్ మెంబర్లు ఎధీరే చెన్నయ్య, గొరిగే కోటీశ్వర్, తుడుం చిన్న కిష్టయ్య మరియు తగ్రా



హరేందర్,దోమ కిష్టయ్య,కోనాపల్లి లక్ష్మయ్య, గోరిగే వెంకయ్య,గొరిగే నరసింహ,ఎదిరే ఐలయ్య, ఇమిడి రాములు,ఇమిడి నరసింహ,గుట్టలి యాదయ్య, ఇమిడి వెంకటయ్య, ఇప్పల కుమార్,నీలా నారాయణ, బుడుగు కుమార్, ఎదిరే మహేష్,కొసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, పిప్పల సాయిలు,పిప్పల రాములు,పిప్పల రాధాకృష్ణ, దయ్యాల యాదయ్య,దోమ యాదయ్య, పిచ్చకుంట్ల శ్రీకాంత్, పిచ్చకుంట్ల కుమార్, పిచ్చకుంట్ల రాఘవ, పిచ్చకుంట్ల విజయ్, గుట్టలి మల్లయ్య, బుడుగు నరసింహ,మాల నరసింహ,పిప్పల మల్లేశ్, అవ అంజయ్య,గురిగే శ్రీశైలం, తుడుం మహేష్, తుడుం రవికుమార్, పిప్పల యాదయ్య, బాయి గడ్డ చంద్రయ్య, దోమ జగదీష్, తుడుం మనీష్, తుడుం సాయి, పిచ్చకుంట్ల శేఖర్, పిప్పల రమేష్, తుడుం ప్రదీప్, పిప్పళ్ళ శ్రీకాంత్, బిక్షపతి,గణేష్,శ్రీకాంత్, బుడుగు శ్రీశైలం,పిప్పళ్ళ కిట్టు,ఎదిరే ప్రతాప్,ఎదిరే శ్రీశైలం,ఎదిరే చంద్రశేఖర్, గౌతమ్,ఎదిరే శివకుమార్,ఎమ్మిడి అరుణ్,గొరిగే శ్రీనాథ్,గొరిగే చింటూ,గోరిగే నందు,ఎడిరే రామకృష్ణ తదితరులు బీఆర్ఎస్ లో చేరారు. ఈకార్యక్రమంలో పాల్గొనప్రజాప్రతినిధులు,నాయకులుమాజీజడ్పిటిసిరావ ్రక్రిష్ణ,కౌన్సిలర్ అనిత రఘునాథ్,కేశంపేట సర్పంచ్ శ్రీశైలం యాదవ్,పోమ్మాలపల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,సర్పంచ్ నాగిళ్ల వెంకట్,కమ్మదనం సర్పంచ్ లత కిరణ్ గౌడ్,మాదేవ్ పూర్ సర్పంచ్ అనూష రవీందర్,రెడ్డి,కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ శేఖర్ పంతులు,ఇప్పలపల్లి మాజీ సర్పంచ్ ఆంజనేయులు యాదవ్,మాజీ కౌన్సిలర్ ఈశ్వర్ రాజు,నిడదవెల్లి మాజీ సర్పంచ్ జయసింగ్,పాపిరెడ్డి గూడ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి,ఇప్పలపల్లి లో మాజీ ఎంపిటిసి రాంచందర్,ఉప సర్పంచ్ సహదేవ్,సింగిల్ విండో మాజీ డైరెక్టర్ పల్నాటి కృష్ణయ్య,నాయకులు నాగరాజు,మన్మధ రెడ్డి,బద్రునాయక్,మని గౌడ్,శేఖర్,చింటు,శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# విమోచన చరిత్రను విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు: డాక్టర్ కె. లక్ష్మణ్, ఎంపీ

**విమోచన చరిత్రను భావితరాలకు చాటిచెప్పడమే లక్ష్యం: నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి**

**13 సెప్టెంబర్ ఆపరేషన్ పోలో అమరవీరులైన వీర జవాన్లకు ఘన నివాళులు అర్పించిన బీజేపీ నాయకులు**





**హైదరాబాద్,(ప్రజావినికిడి):** ఆపరేషన్ పోలోలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ట్యాంక్‌బండ్‌పై ఉన్న యుద్ధ ట్యాంక్ దగ్గర నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమరవీరుల స్మారకార్థం పుష్పాంజలి ఘటించారు.

తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు చేరవేయాలనే సంకల్పంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్ర రావు,డాక్టర్ కె. లక్ష్మణ్, విమోచన కమిటీ చైర్మన్ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్,ఎమ్మెల్యే హరీష్, ఎమ్మెల్సీ కొమరయ్య, డాక్టర్ గౌతమ్ రావు, కాసం వెంకటేశ్వర్లు, భాషా తదితరులు పాల్గొన్నారు.

ఎన్. రామచంద్ర రావు మాట్లాడుతూ,

సెప్టెంబర్ 17, 1948న సర్దార్ వల్లభభాయ్ పటేల్ చొరవ, తెలంగాణ ప్రజల వీరోచిత పోరాటాల ఫలితంగా హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించిందని అన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.

సర్దార్ పటేల్ నాయకత్వంలో భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ పోలో హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడానికి నిర్ణయాత్మకంగా నిలిచిందని తెలిపారు. ఈ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వీరుల త్యాగాలను దేశం ఎప్పటికీ మరువకూడదన్నారు.

డాక్టర్ కె. లక్ష్మణ్,ఎంపీ మాట్లాడుతూ,

1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడం తెలంగాణ చరిత్రలో కీలక ఘట్టమని అన్నారు. నిజాం, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు వీరోచితంగా పోరాడారని తెలిపారు.

వీరభైరాన్‌పల్లి, అప్పంపల్లి వంటి ప్రాంతాల్లో అమరులైన వీరుల త్యాగాలు తెలంగాణ విమోచన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సర్దార్ పటేల్ నాయకత్వంలో ఆపరేషన్ పోలో చేపట్టి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కల్పించారని తెలిపారు.

విమోచన చరిత్రను రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని విమర్శించారు. ఈ చరిత్ర ఎన్నికలకు, రాజకీయాలకు సంబంధించిన అంశం కాదని, భావితరాలకు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను తెలియజేయాల్సిన చారిత్రక బాధ్యత అని అన్నారు.

డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ,

తెలంగాణ విమోచన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలు చేసిన పోరాటం,భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ పోలో తెలంగాణ విమోచన చరిత్రలో కీలక ఘట్టాలని పేర్కొన్నారు.

దేశ రక్షణ కోసం సేవలందించిన సైనికుల త్యాగాలను గౌరవించడం, వారి సేవలను భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అని అన్నారు.

నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ,

తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు చాటిచెప్పడమే తెలంగాణ విమోచన కమిటీ ప్రధాన లక్ష్యమని అన్నారు. 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచనకు నాంది పలికిన చారిత్రక దినమని పేర్కొన్నారు. సెప్టెంబర్ 13, 1948న నాటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆదేశాల మేరకు, మేజర్ జనరల్ జె.ఎన్. చౌధురి నాయకత్వంలో భారత సైన్యం ఆపరేషన్ పోలో చేపట్టిందని తెలిపారు.

నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాల నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించడంలో ఆపరేషన్ పోలో కీలక పాత్ర పోషించిందన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ప్రతి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవాన్ని చారిత్రక స్ఫూర్తితో నిర్వహిస్తూ, అమరవీరుల త్యాగాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెలంగాణ విమోచన కమిటీ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తుందని నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి తెలిపారు.

**రిటైర్డ్ సైనికులకు ఘన సన్మానం**

ఈ సందర్భంగా ఆపరేషన్ పోలోలో సేవలందించిన రిటైర్డ్ ఆర్మీ జవానులను డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ నేతృత్వంలో ఘనంగా సన్మానించారు. దేశ రక్షణకు సైనికులు చేసిన సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో కెప్టెన్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు దీపక్ రెడ్డి, భరత్ గౌడ్,విమోచన కమిటీ సభ్యులు కిరణ్,సంజయ్, రవీందర్ రావు, డాక్టర్ వెంకట్ రెడ్డి,స్పోర్ట్స్ సెల్ శ్రీధర్ తదితరులు, పెద్ద సంఖ్యలో రిటైర్డ్ ఆర్మీ జవాన్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అమరవీరులకు నివాళులు అర్పించారు.

# విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు.




,(ప్రజావినికిడి): ప్రత్యేక కథనం

హిందూ పండుగల్లో వినాయక చవితికి విశిష్టమైన స్థానం ఉంది. ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా ముందుగా వినాయకుడిని పూజించడం భారతీయ సంప్రదాయంలో ఆనవాయితీగా వస్తోంది. అందుకే గణపతిని ఆది పూజ్యుడు, విఘ్నేశ్వరుడు, గణనాథుడు, లంబోదరుడు, గజాననుడు వంటి అనేక పేర్లతో భక్తులు కొలుస్తారు. ప్రతి సంవత్సరం భాద్రపద శుద్ధ చవితి రోజున వినాయక చవితిని ఘనంగా జరుపుకుంటారు.
వినాయక చవితి కేవలం ఒక పూజా కార్యక్రమం మాత్రమే కాదు. భక్తి, జ్ఞానం, శుభారంభం, ఐక్యత, సామాజిక చైతన్యానికి ప్రతీకగా ఈ పండుగ నిలుస్తోంది.

### గణపతి ఎవరు?

హిందూ పురాణాల ప్రకారం గణపతి పార్వతీ పరమేశ్వరుల కుమారుడు. గణపతికి ఏనుగు తల ఉండటం వెనుక ఒక ప్రసిద్ధ పురాణ కథ ఉంది.
ఒకసారి పార్వతీదేవి తనకు రక్షణగా ఒక బాలుడిని సృష్టించి, తాను స్నానానికి వెళ్లే సమయంలో ఎవరినీ లోపలికి అనుమతించవద్దని ఆదేశిస్తుంది. తల్లి ఆజ్ఞను పాటిస్తూ ఆ బాలుడు ద్వారం వద్ద కాపలాగా నిలుస్తాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన పరమేశ్వరుడిని కూడా బాలుడు లోపలికి అనుమతించడు. దీంతో కోపోద్రిక్తుడైన శివుడు ఆ బాలుడి తలను నరికి వేస్తాడు.
తరువాత పార్వతీదేవి ఆగ్రహించడంతో, శివుడు ఏనుగు తలను అమర్చి ఆ బాలుడికి తిరిగి ప్రాణం పోస్తాడు. అనంతరం అతడిని తన కుమారుడిగా స్వీకరించి, సర్వగణాలకు అధిపతిగా, అన్ని శుభకార్యాలకు ముందుగా పూజలు అందుకునే దేవుడిగా వరమిస్తాడని పురాణ కథనం.
అందుకే గణపతిని "ప్రథమ పూజ్యుడు"గా భక్తులు ఆరాధిస్తారు.

### వినాయక చవితి ఎందుకు జరుపుకుంటారు?

వినాయక చవితిని ప్రధానంగా గణపతి జన్మదినంగా భావించి జరుపుకుంటారు. భాద్రపద మాసంలోని శుక్లపక్ష చవితి రోజున గణపతి అవతరించాడని పురాణ విశ్వాసం.వినాయకుడు జ్ఞానానికి, వివేకానికి, శుభానికి ప్రతీకగా భావిస్తారు. జీవితంలో ఎదురయ్యే ఆటంకాలు తొలగిపోవాలని, కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలని, విద్య, ఉద్యోగం, వ్యాపారం తదితర రంగాల్లో విజయాలు సాధించాలని భక్తులు గణపతిని ప్రార్థిస్తారు.
"వక్రతుండ మహాకాయ సూర్యకోటి సమప్రభ
నిర్విఘ్నం కురుమే దేవ శుభకార్యేషు సర్వదా"
అనే ప్రార్థనలోనూ ఎలాంటి విఘ్నాలు లేకుండా శుభకార్యాలు విజయవంతంగా పూర్తికావాలని గణపతిని ప్రార్థిస్తారు.

### మట్టి వినాయకుడి వెనుక ఉన్న సందేశం

సంప్రదాయంగా వినాయక విగ్రహాలను మట్టితో తయారు చేసేవారు. పూజ అనంతరం విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేయడం ద్వారా ప్రకృతిలోని మట్టి తిరిగి ప్రకృతిలో కలిసిపోతుంది.
వినాయక చవితి మనిషి జీవితం కూడా ప్రకృతిలో నుంచే పుట్టి చివరకు ప్రకృతిలోనే కలిసిపోతుందనే తాత్విక సందేశాన్ని అందిస్తుంది.
అయితే ఇటీవలి కాలంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాల వల్ల నిమజ్జనం అనంతరం నీటి కాలుష్యం పెరుగుతోంది. అందువల్ల మట్టి వినాయకులను ప్రోత్సహించడం, సహజ రంగులను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది.

### వినాయకుడికి ఇష్టమైన పత్రి ఎందుకు?

వినాయక చవితి పూజలో పత్రికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. సాధారణంగా గణపతికి 21 రకాల పత్రులు సమర్పించే సంప్రదాయం అనేక ప్రాంతాల్లో ఉంది. ఇందులో ప్రకృతిలో లభించే వివిధ రకాల ఆకులు, మొక్కలకు ప్రాధాన్యం ఉంటుంది.
పురాతన సంప్రదాయాలు ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తాయి. పండుగ సందర్భంగా మొక్కలు, చెట్లు, ప్రకృతి విలువను గుర్తించడం కూడా ఈ ఆచారాల్లోని ఒక ముఖ్యమైన సందేశంగా భావించవచ్చు.

### ఉండ్రాళ్లు, కుడుములు ఎందుకు?

వినాయకుడి నైవేద్యంలో ఉండ్రాళ్లు, కుడుములు, మోదకాలకు ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా మోదకం గణపతికి అత్యంత ఇష్టమైన నైవేద్యంగా పురాణ సంప్రదాయంలో చెప్పబడుతుంది.
మోదకం జ్ఞానం, ఆనందానికి ప్రతీకగా భావించే ఆధ్యాత్మిక వివరణలు ఉన్నాయి. అందుకే వినాయక పూజలో భక్తులు మోదకాలు, ఉండ్రాళ్లు, కుడుములు తదితర నైవేద్యాలను సమర్పిస్తారు.

### గణపతి ఆకారంలోనూ ప్రత్యేకతే

వినాయకుడి రూపంలోని ప్రతి అంశానికి ప్రత్యేకమైన అర్థాన్ని ఆధ్యాత్మిక సంప్రదాయాలు చెబుతాయి.
పెద్ద చెవులు మంచి మాటలను ఎక్కువగా వినాలనే సందేశం.
చిన్న కళ్ళు ఏకాగ్రతతో చూడాలనే సూచన.
పెద్ద పొట్ట జీవితంలో ఎదురయ్యే మంచి చెడులను జీర్ణించుకునే సహనం.

### ఏనుగు తల జ్ఞానం, వివేకం, బలానికి ప్రతీక.

చిన్న నోరు తక్కువ మాట్లాడి ఎక్కువగా వినాలనే సందేశం.ఎలుక వాహనం కోరికలను అదుపులో ఉంచుకోవాలనే తాత్విక భావనగా వివరిస్తారు.
అందువల్ల గణపతి విగ్రహం కేవలం ఒక దేవతా రూపం మాత్రమే కాకుండా జీవన విధానానికి సంబంధించిన అనేక సందేశాలను అందించే ప్రతీకగా నిలుస్తుంది.

### ఇంటింటా పూజ నుంచి సామూహిక ఉత్సవం వరకు

వినాయక చవితి సందర్భంగా ప్రజలు ఇళ్లలో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదే సమయంలో గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో వివిధ ప్రాంతాల్లో సామూహికంగా గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించడం కూడా ఆనవాయితీగా మారింది.
ప్రజలు పెద్ద సంఖ్యలో ఒకచోట చేరి భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ విధంగా వినాయక ఉత్సవాలు సామాజిక ఐక్యతకు కూడా వేదికగా మారుతున్నాయి.

### స్వాతంత్ర్య ఉద్యమంలోనూ కీలక పాత్ర

వినాయక చవితి సామూహిక ఉత్సవంగా విస్తరించడంలో మహారాష్ట్రలోని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు బాల గంగాధర్ తిలక్ పాత్రను చరిత్రలో ప్రత్యేకంగా గుర్తిస్తారు.
బ్రిటిష్ పాలన కాలంలో ప్రజలను ఒకచోట చేర్చి సామాజిక, జాతీయ చైతన్యం కల్పించేందుకు ఆయన సామూహిక గణపతి ఉత్సవాలను ప్రోత్సహించారు.
దీంతో గణపతి ఉత్సవాలు క్రమంగా ప్రజలను ఏకం చేసే సామాజిక వేదికగా కూడా మారాయి.

### నిమజ్జనం ఎందుకు చేస్తారు?


వినాయక చవితి పూజ అనంతరం నిర్ణీత రోజున గణపతి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేయడం సంప్రదాయం.
దీని వెనుక సృష్టిస్థితిలయ అనే తాత్విక భావనను అనుసంధానిస్తారు. మట్టితో తయారైన విగ్రహం పూజలందుకుని చివరకు నీటిలో కలసి తిరిగి ప్రకృతిలో భాగమవుతుంది.
ఇది జీవితం శాశ్వతం కాదని, ప్రకృతిలో పుట్టిన ప్రతి జీవి చివరకు ప్రకృతిలోనే కలిసిపోతుందనే సందేశాన్ని అందిస్తుంది.

### పండుగతో పాటు బాధ్యత కూడా

ప్రస్తుత కాలంలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించేటప్పుడు భక్తితో పాటు బాధ్యత కూడా అవసరం. అధిక శబ్దం, ప్లాస్టిక్ వినియోగం, రసాయన రంగులు, నీటి వనరుల్లో కాలుష్యం వంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించడం, సహజ రంగులను ఉపయోగించడం, ప్లాస్టిక్‌ను తగ్గించడం, నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడం ద్వారా పర్యావరణహితంగా పండుగను జరుపుకోవచ్చు.
వినాయక చవితి మనకు అందించే అసలైన సందేశం విఘ్నాలను తొలగించమని దేవుడిని కోరుకోవడమే కాదు. మన జీవితంలో ఉన్న అజ్ఞానం, అహంకారం, కోపం, స్వార్థం, నిర్లక్ష్యం వంటి విఘ్నాలను మనమే తొలగించుకోవాలని గుర్తుచేయడం.
గణపతిని పూజించడం అంటే జ్ఞానం, వివేకం, సహనం, మంచి ఆలోచనలను మన జీవితంలో ఆచరించడం.

**వినాయక చవితి ఒక పండుగ మాత్రమే కాదుడ**
**ప్రకృతిని గౌరవించాలనే సందేశం,**
**సమాజంతో కలిసి నడవాలనే స్ఫూర్తి,**
**విఘ్నాలను అధిగమించాలనే సంకల్పం,**
**జ్ఞానంవివేకంతో జీవించాలనే బోధ.**

అందుకే ప్రతి ఏడాది వినాయక చవితి వచ్చినప్పుడు భక్తులు గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ "విఘ్నాలు తొలగాలిడ జ్ఞానం పెరగాలి సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలి" అని ఆకాంక్షిస్తారు.



# మట్టితో మహాగణపతి



**నంద్యాల సెప్టెంబర్,13,(ప్రజావినికిడి):**
: కశెట్టి సుబ్బమ్మ మరియు బాలాజీ మర్చంట్స్ కమిటీ కళ్యాణ మండప దేవస్థానం నందు శ్రీ వరసిద్ధి వినాయక చవితి ఉత్సవాలను 40వ వార్షికోత్సవంగా నిర్వహించనున్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ నిమిత్తం నంద్యాల పట్టణంలో మొట్టమొదటిసారిగా గత 13 సంవత్సరాలుగా మట్టితో తయారు చేసిన విగ్రహాలను ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో టంగుటూరు గ్రామానికి చెందిన కుమ్మరి మద్దిలేటి, ఆయన శిష్య బృందం మూడు నెలల పాటు శ్రమించి మట్టి విగ్రహాన్ని తయారు చేసి ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ప్రత్యేకతగా మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ అవతారాలతో విశ్వ సంరక్షక మహాగణపతిగా స్వామివారిని ఏర్పాటు చేశారు.ఆలయ అర్చకుల అర్చకత్వంలో ఈ నెల 14వ తేదీ సోమవారం నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 16వ తేదీ బుధవారం విశ్వ సంరక్షక మహాగణపతి హోమాన్ని నిర్వహించనున్నారు. ఈ హోమంలో భక్తాదులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.40 సంవత్సరాల వినాయక ఉత్సవాల సందర్భంగా మొట్టమొదటిసారిగా చేతి లడ్డూను ఏర్పాటు చేస్తున్నారు. 18వ తేదీ శుక్రవారం, నిమజ్జనం రోజున ఉదయం 11 గంటలకు దేవస్థానం నందు లడ్డూ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తాదులు ఈ లడ్డూ వేలంలో పాల్గొని స్వామివారి లడ్డూను స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. **కమిటీ సభ్యులు:**కశెట్టి కృష్ణమూర్తి దేవస్థాన అధ్యక్షులునారాయణ శ్రీనివాస కుమార్ ప్రధాన కార్యదర్శిదుద్దేల సురేష్ బాబు కోశాధికారిఈ కార్యక్రమంలో లగిశెట్టి నవీన్ కుమార్, లగ్గిశెట్టి ఋషి కుమార్, నల్లగట్ల నరసింహారావు, బొగ్గరపు వంశీకృష్ణ, కొప్పర్ల శ్రీనివాస్, రవితేజ, పాలూరి వెంకటనారాయణ, అడ్డగాళ్ళ చంద్రశేఖర్, సునీల్, పసుపుల శివ సాయి తదితరులు పాల్గొన్నారు.
**వినాయక చవితి నిర్వాహకులు:**కశెట్టి చంద్రశేఖర్ బీజేపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి, దేవస్థానం ఉపాధ్యక్షులు.సహకరించిన వారు: నారాయణ ధీరజ్, బొగ్గారపు అభి.గత 25 సంవత్సరాలుగా 1,500 మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తూ వస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు



# యస్ యస్ మాసజ్ సేంటర్ రాయికల్ లో ప్రారంభం..

**రాయికల్ మండలం సెప్టెంబర్,13,(ప్రజావినికిడి):**
జగిత్యాల జిల్లాలోని రాయికల్ పట్టణం లోని వివేకవర్ధిని స్కూల్ పక్కన యస్ యస్ మాసజ్ సెంటర్ ను. చేర్ల కొండాపూర్ గ్రామానికి చెందిన బుడికె సంతోష్ నవ్య శ్రీ కి చెందిన మాస జ్ సెంటర్ ను యాజమాన్యం ప్రారంభించారు ఈ మెసేజ్ సెంటర్ ద్వారా చాలా ఉపయోగకరంగా ఉంటుందని
ఈ సెంటర్ ఇంతవరకు హైదరాబాద్ యందు చాలా వరకు విస్తారంగా ఉన్నాయని తెలిపారు..





ఈ సందర్భంగా మెసేజ్ సెంటర్ కు వచ్చిన మహితాపూర్ యాదవ సంఘం అధ్యక్షులు మరియు గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు బుస గంగా మల్లయ్య మెసేజ్ చేయించు కొని ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ. మన ఏరియాలో మనకు చాలా మంది కి అనవసరమైన పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చి ఇక్కడ అందరికీ ఉపయోగపడే విధంగా
ఒక్కసారిగా మసాజ్ చేయించికొని వారు మళ్లీ మళ్లీ చేయించు కోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ మెసేజ్ సెంటర్ యందు పది నిమిషాలు చేసుకుని చాలా వరకు రిలీఫ్ అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఫుల్ బాడి షోల్డర్ బ్యాక్ విత్ రోలర్ డిప్ రిలాక్షేషన్ మరియు హెల్త్ ప్రియరిటి ఉంటుందని నిర్వాహకులు తెలిపారని హనుమల్ల సత్యనారాయణ తెలిపారు

# రాయికల్ కు చెందిన చెట్పల్లి ప్రభాకర్ ఊపిరితిత్తుల సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాఅతనికి అత్యవసర సహాయం కోసం విజ్ఞప్తి

**రాయికల్ సెప్టెంబర్,1,(ప్రజావినికిడి):**
జగిత్యాల జిల్లా రాయికల్ వాసి చెట్పల్లి ప్రభాకర్ ప్రస్తుతం తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో (లంగ్ డామేజ్ ) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉండటంతో, వైద్యుల పర్యవేక్షణలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు.
ఈ చికిత్సకు భారీగా ఖర్చు అవుతున్నందున, ప్రభాకర్ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది.ఈ క్లిష్ట సమయంలో మన వంతు సహాయం అందిద్దాం. మీరు అందించే చిన్న సహాయం కూడా ఆయన చికిత్సకు ఎంతో ఉపయోగపడుతుంది.మీకు సాధ్యమైనంత ఆర్థిక సహాయం చేయండి.మన మిత్రుడి ప్రాణాలను కాపాడేందుకు మనమంతా కలిసి నిలబడదాం.ఈ సందేశాన్ని మీ బంధువులు, మిత్రులు మరియు వాట్సాప్ గ్రూపుల్లో వీలైనంత ఎక్కువగా షేర్ చేయండి."మనిషికి మనిషే అండడ ఆపదలో ఒక చిన్న తోడ్పాటే ప్రాణదానం." చెట్పల్లి ప్రభాకర్ గారి త్వరితగతిన కోలుకోవాలని మనస్ఫూర్తిగా ప్రార్థిద్దాం. సహాయం చేయడం కోసం చెట్పల్లి తేజశ్వనియూపీఐ / ఫోన్పే :+917893075285 బిబిబిబి




## రాయికల్ మున్సిపల్ ఆధ్వర్యంలో
# మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**రాయికల్ సెప్టెంబర్,13,(ప్రజావినికిడి):**
జగిత్యాల జిల్లా రాయికల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధికారులు, కౌన్సిలర్లు పాల్గొని ప్రజలకు మట్టి విగ్రహాల వినియోగం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు, అనంతరం విగ్రహా ప్రతిమలను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ కౌన్సిలర్ రాకేష్ నాయక్, తురగా శ్రీధర్ రెడ్డి అందే భూమన్న బత్తిని నాగరాజు సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



# 69 అడుగుల ఎకో ఫ్రెండ్లీ గణపయ్య - ఖైరతాబాద్ గణేశుడి విగ్రహ విశేషాలు ఇవే!

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో ఖైరతాబాద్ బడా గణేశుడు అంటే ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. గణేశ్ నవరాత్రులు అంటే అందరి చూపు ఈయనపైనే ఉంటుంది. విగ్రహ తయారీ పనులు ప్రారంభం నుంచి వినాయకుడి ఆగమన్, నిమజ్జనం వరకు ప్రతి దశ ఎంతో కీలకంగా ఉంటుంది. ప్రతీ కైంకర్యం ఒక పండుగలా జరుగుతుంది. ఏటా సరికొత్త రూపంలో కొలువుదీరే ఈ బడా గణేశుడు ఈసారి పంచముఖ సంకటహర మహా గణపతి రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నాడు.అయితే ఈ భారీ విగ్రహం వెనక వందలాది మంది కళాకారుల శ్రమ దాగి ఉంటుంది. 3 నెలల పాటు పలు రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు పగలు, రాత్రి తేడా లేకుండా కష్టపడి ఈ మహా విగ్రహానికి జీవం పోస్తారు. అయితే ఈసారి ఖైరతాబాద్ బడా గణనాథుడి తయారీ, కళాకారుల శ్రమ ఏంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం.ఒక్క అడుగుతో ప్రారంభమై గణేశుడి నిర్మాణ పనులు మొదటగా నిర్జల



ఏకాదశి రోజున కర్రపూజతో మొదలవుతాయి. అంటే వినాయక చవితికి మూడు నెలల ముందే గణేశ్ విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభిస్తారు. గత కొన్నేళ్లుగా పర్యావరణహితమైన మట్టి గణపతినే ఉత్సవ సమితి తయారు చేయిస్తోంది. ప్రధాన విగ్రహంతో పాటు పక్కన నెలకొల్పే చిన్న విగ్రహాలను కూడా మట్టితోనే ఏర్పాటు చేస్తారు. 1954 నుంచి ఖైరతాబాద్? ఉత్సవాలు ఎంతో ఘనంగా కొనసాగుతూ వస్తున్నాయి.

ఒక్క అడుగుతో ప్రారంభమై 70 అడుగులకు పైగా విగ్రహం ఎత్తు పెంచుతూ తయారు చేశారు. అయితే కరోనా అనంతరం ఏటా క్రమంగా ఒక్కో అడుగు ఎత్తు తగ్గిస్తూ వస్తున్నారు.బడా గణేశుడికి రూపమిచ్చారిలా ఈ ఏడాది 69 అడుగుల పంచముఖ సంకటహర మహాగణపతిని సిద్ధం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన 150 మందికి పైగా కళాకారులు ఈ నిర్మాణంలో భాగమయ్యారు. ముందుగా భారీ విగ్రహానికి అంతర్గత నిర్మాణాన్ని సిద్ధం చేశారు. స్టీల్ రాడ్లు, మెష్, కలపతో కూడిన సపోర్టింగ్ నిర్మాణంతో వినాయకుడి ఆకృతికి రు. ముందుగా భారీ విగ్రహానికి అంతర్గత పునాది వేశారు. ఆ తర్వాత ఎండిన వరి గడ్డిని పొరలుగా అమర్చి దానిపై మట్టి, ఇసుక మిశ్రమాన్ని పూస్తూ ఒక్కో అవయవానికి రూపం ఇచ్చారు.ఎకో ఫ్రెండ్లీ పదార్థాలతో తయారీగత కొన్నేళ్లుగా పర్యావరణ హితంగా విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. విగ్రహ తయారీ కోసం రాజస్థాన్ నుంచి తెచ్చిన సుమారు 1000 బ్యాగుల నేచురల్ రివర్ క్లే పౌడర్?ను హైదరాబాద్‌లో లభించే ఇసుకతో కలిపి వినియోగించారు. 30 టన్నుల స్టీల్, 22 టన్నుల కర్రలు, వందల మోపుల గడ్డి ఇలా ఎకో ఫ్రెండ్లీ పదార్థాలతో విగ్రహ తయారీ చేశారు. ప్రధాన గణేశుడే కాదు పక్కన ప్రతిష్ఠించే విగ్రహాలను కూడా ఇదే తరహాలో తయారు చేస్తారు. మొదటగా విడి భాగాలను స్టీల్ తో మౌల్డ్ తయారు చేసుకుని, తర్వాత మట్టి పనులు ప్రారంభిస్తారు. ఇలా ఒక్కో భాగాన్ని తీర్చిదిద్దడం వెనక ఎంతో నైపుణ్యం దాగి ఉంటుంది.మట్టి పగుళ్లు రాకుండా సుతిలి పొడి, ఇసుక, గడ్డి మిశ్రమంతో విగ్రహ పైభాగాన్ని సున్నితంగా తీర్చిదిద్దారు. చివరిగా వాటర్ కలర్స్?తో విగ్రహానికి తుది మెరుగులు దిద్దారు. చూడటానికి ఎంతో అందంగా కనిపించే ఈ 69 అడుగుల మహాగణపతి వెనక మూడు నెలల ప్రణాళిక, 150 మందికి పైగా శ్రామికులు శ్రమ, పలు రాష్ట్రాల కళాకారుల నైపుణ్యం దాగి ఉన్నాయి.

# గోవా వెళ్లి అశోక్ గజపతిరాజు ఆశీస్సులు అందుకున్న చిన్న శ్రీను

**విజయనగరం:** ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. గోవాలో జరిగిన ఈ భేటీలో ఆయన కుమార్తె సిరి సహస్ర కూడా ఉన్నారు.గోవాలోని గవర్నర్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో అశోక్ గజపతిరాజు.. చిన్న శ్రీనుకు, ఆయన కుమార్తెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కూడా వారితో పాటు



ఉండి, చిన్న శ్రీను కుటు ంబానికి ఆతిథ్యం ఇచ్చారు.సమావేశం అనంతరం చిన్న శ్రీను మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చం ద్రబాబు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఆదేశాలను, అలాగే అశోక్ గజపతిరాజు వంటి పెద్దల సూచనలను తాను తు.చ. తప్పకుండా పాటిస్తానని స్పష్టం చేశారు. కేవలం ఆయన ఆశీస్సు లు, మార్గనిర్దేశం కోసమే ప్రత్యేకంగా కలిసినట్లు వివరించారు.కాగా, వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణకు మేనల్లుడైన చిన్న శ్రీను, ఇటీవల వైసీపీకి రాజీనామా చేసి తన కుమార్తె సిరి సహ స్రతో కలిసి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఉండవల్లిలో చంద్రబాబు వారికి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో విజయనగరం ు సీనియర్ నేత అశోక్ గజపతి రాజుతో చిన్న శ్రీను భేటీకి రాజకీయంగా ప్రాధాన్యం ఏర్పడింది.

# ఉద్యోగులు, మీడియాపై పోలీసుల దౌర్జన్యం.



**హైదరాబాద్** కుత్బుల్లాపూర్ జలమండలి విభాగంలో మీటర్ రీడర్‌గా పనిచేస్తున్న కిరణ్ అనే వ్యక్తి జీతాలు రాక గుండెపోటుతో మృతి చెందాడని తెలిసిందే. కొద్ది రోజులుగా జలమండలి కార్మికుల సమ్మెలో పాల్గొంటున్న కిరణ్.. అధికారుల వేధింపులు, జీతాలు రాకపోవడం, ఉద్యోగ భద్రతపై తీవ్ర ఆవేదనకు గురైనట్లు తోటి ఉద్యోగులు తెలిపారు. రోజూ సమ్మెలో పాల్గొంటూ తెలంగాణ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని పోరాడుతున్న క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై గుండెపోటుతో మృతి చెందాడని పేర్కొన్నారు.ఈ క్రమంలో హైదరాబాద్ -- బాలానగర్ సమీపంలోని ఫతేనగర్‌లో నిరసనలో పాల్గొని వచ్చాక గుండెపోటుతో చనిపోయిన జలమండలి మీటర్ రీడర్ కిరణ్ ముదిరాజ్ ఇంటి వద్ద పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రభుత్వ తీరు విరుచుకుపడుతూనే.. మరోవైపు ఉద్యోగులను గల్ల పట్టుకుని లాక్కెళ్లడం వీడియోలో చూడొచ్చు. పోలీసుల తీరుపై తీవ్ర అభ్యంతరం చేస్తున్నప్పటికీ వినకుండా వారి ఇష్టానుసారంగా వ్యవహరించడం చూడొచ్చు. దీనికి సంబంధించిన వీడియో కాంగ్రెస్ సర్కార్‌లో ఖాకీల అరాచకం ఎలా ఉందో చెప్పకనే చెబుతోంది.

# వినాయకుడి రూపంలోనే మనకు ఎన్నో సందేశాలు

**సిద్దిపేట జిల్లా, ఆగస్టు 13 :** విఘ్నేశ్వరుడు దేవుడే కాకుండా ప్రజలందరికీ మార్గదర్శకుడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. అమర్నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట పట్టణంలోని వెంకటేశ్వర ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వినాయక విగ్రహాన్ని ఎంత పెద్దగా పెట్టామన్నది ముఖ్యం కాదని.. ఎంత భక్తిశ్రద్ధలతో పూజించామన్నదే ముఖ్యమన్నారు. ఊరికి ఒక మట్టి విగ్రహాన్ని ఏర్పాటుచేసి పూజించాలని తాను గతంలో చెప్పానని గుర్తు చేశారు. ఏ గ్రామంలోనైనా, వార్డులోనైనా ఒక్కటే ఒక మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటే తాను పర్మినెంట్ షెడ్డు నిర్మించి ఇస్తానని పిలుపునిచ్చారు...రసాయనాలతో కూడిన వినాయకులను చెరువులో నిమజ్జనం చేయడంతో నీళ్లలో ఉండే జీవరాశులు చనిపోవడంతోపాటు భూమి కలుషితమై ప్రజా ఆరోగ్యానికి కీడు చేసే క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు... వినాయకుడి రూపంలోనే మనకు ఎన్నో సందేశాలు ఉన్నాయి. ఆయన పెద్ద తల గొప్పగా ఆలోచించమని చెబుతుంది... పెద్ద చెవులు ప్రజల మాట వినాలని చెబుతాయి... చిన్న కళ్లు లక్ష్యంపై దృష్టి పెట్టాలని చెబుతాయి. ఆయన తొండం పరిస్థితులకు అనుగుణంగా



ముందుకు సాగాలని నేర్పుతుంది. అందుకే గణపతి కేవలం పూజించే దేవుడు మాత్రమే కాదు... మన జీవితానికి మార్గదర్శకుడన్నారు..ప్రకృతిని ప్రేమించి, పుష్పాలను ప్రేమించే గొప్ప సంస్కృతి మన తెలంగాణ వారిదన్నారు. దక్షిణ భారతదేశంలోనే అమర్నాథ్ అన్నా సేవ సమితి ప్రసిద్ధిగాంచిందన్నారు. అమర్నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో 16 సంవత్సరాలుగా మంచు కొండల్లో సేవలందించడం గొప్ప విషయమన్నారు. అలాగే ప్రకృతిని ప్రేమిస్తూ 16 సంవత్సరాలుగా సిద్దిపేటలో ప్రతి సంవత్సరం 10 వేల మట్టి విగ్రహాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మనం ఏ కార్యక్రమం చేపట్టిన ముందు విఘ్నేశ్వరుని పూజించే చేపడుతామని ఆ విఘ్నేశ్వరుడి ఆశీర్వాదంతో ప్రజలందరూ ఆరోగ్యంగా సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నానారు.విఘ్నేశ్వరుడి దయతో విఘ్నాలు తొలగాలి.వినాయక చవితి పర్వదినం సందర్భంగా హరీశ్ రావు ప్రజలందరికి వినాయకచవితి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పర్వదినాన్ని ప్రజలంతా కుటుంబసమేతంగా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి. సకల కార్యాలకు ప్రథమ పూజ చేసేది, పూజించేది విఘ్నేశ్వరుడినే... ఆ దేవుడి అనుగ్రహంతో విఘ్నాలు తొలిగి అన్నింటా శుభం చేకూరాలన్నారు. నిర్విఘ్నంగా అన్ని కార్యాలు నెరవేరాలి.. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు.. మట్టి గణపతి ప్రతిమను పూజించాలి 'మట్టి గణపతే మహా గణపతి అని అన్నారు.

# పోలీస్ కస్టడీకి ఆర్మీ ఆయుధాల చోరీ కేసు నిందితుడు - పూర్తి నెట్‌వర్క్‌పై ఆరా తీయనున్న పోలీసులు

**హైదరాబాద్ :** సికింద్రాబాద్ బొల్లారం కంటోన్మెంట్‌లోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆర్మీ ఆయుధాల చోరీ కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం వెలుగుచూసిన వెంటనే అప్రమత్తమైన ఆర్మీ, పోలీసులు, నిఘా వర్గాలు రంగంలోకి దిగాయి. ఎట్టకేలకు చోరీకి గురైన 10 రోజు ల అనంతరం ఆయుధాలను ఇటీవల స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితుడిని కూడా అరెస్ట్ చేశారు. ఈ కేసును మరింత లోతుగా విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.15వ తేదీ నుంచి పోలీస్ కస్టడీఇందులో భాగంగ ఆయుధాల కేసు ప్రధాన సూత్రధారిగా ఉన్న నిందితుడు మల్లేశ్‌ను సికింద్రాబాద్ కోర్టులో హాజరుప ిరిచారు. కోర్టు నిందితుడికి 7



రోజులపాటు పోలీస్ కస్టడీకి అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకుంది. కోర్టు ఆదేశాలతో ఈనెల 15వ తేదీ నుంచి వారం రోజులపాటు నిందితుడిని పోలీసులు విచారించనున్నారు. అసలు కుట్రదారులెవరు :పటిష్ఠ భద్రత ఉన్న ప్రాంతం నుంచి ఏకంగా ఆర్మీ ఆయుధాలనే చోరీ చేయడంపై పోలీసులు ముమ్మ రంగా దర్యాప్తు చేయనున్నారు. ఈ ఘటన వెనుక ఉన్న అసలు కుట్రదా రులు ఎవరు దీని వెనుక ఉన్న ముఠా నెట్‌వర్క్ ఏంటి? ఆయుధాల ను ఎవరికి ఇవ్వాలనుకున్నారు? వంటి వివరాలను రాబట్టనున్నారు .కేవలం ఒకే కోణంలో కాకుండా, కేసులోని అనుమానితులనూ నిందితుడు మల్లేశ్‌తో ముఖాముఖి కూర్చోబెట్టి ఉమ్మడిగా విచారించాలని పోలీసులు ప్లాన్ చేస్తున్నారు. నిందితుల వాంగ్మూలాల్లోని తేడాలను బట్టబయలు చేస్తూ అసలు నిజాలను తెలుసుకొనేందుకు పక్కా ప్రణాళికతో వ్యవహరించనున్నారు.లోపలి వ్యక్తుల హస్తం ఉందా?అత్యంత భద్రత కలిగిన ప్రాంతం నుంచి ఆర్మీ ఆయుధాలను బయటకు తీసుకురావడం వెనుక లోపలి వ్యక్తుల హస్తం ఉందా? చోరీ వెనుక మొత్తం ఎంతమంది ఉన్నారనే వివరాలను పోలీసులు తమ దర్యాప్తులో భాగంగా నిగ్గు తేల్చనున్నారు. నిందితుడు మల్లేశ్? నుంచి లభించే ఆధారంగా ఆధారంగా లోతైన దర్యాప్తు చేపట్టాలని నిర్ణయించారు.ఈ మొత్తం దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అన్ని వివరాలను ఎన్?ఐఏ సహా ఇతర దర్యాప్తు సంస్థలకు అందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే పోలీస్? కస్టడీలో భాగంగా మరిన్ని కీలక వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# టిమ్స్‌లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్ ప్రారంభం

**హైదరాబాద్:** డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్ ప్రారంభమైంది. తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ (ఆదివారం) ఆస్పత్రికి చేరుకుని వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెడికల్ రోబోటిక్ ఎక్విప్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను



ఆయన పరిశీలించారు. వాటి వినియోగంపై నిపుణులను అడిగి తెలుసుకున్నారు. వైద్య రంగంలో రోబోటిక్ సర్జరీ సేవలను మరింత విస్తృతం చేయడం, ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడంపై రాజనర్సింహ చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ వాణి, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, డాక్టర్ బీరప్ప, డాక్టర్ విమల థామస్, డాక్టర్ సుధీర్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ప్రయాణికులకు బ్యాడ్ న్యూస్.. 50శాతం పెరిగిన బస్సు ఛార్జీలు!




**హైదరాబాద్ :**ఆర్టీసీ ప్రయాణికులు బిగ్ షాక్ తగిలింది.. వరుస పండగల సెలవుల నేపథ్యంలో బస్సు చార్జీలు భారీగా పెంచినట్టు తెలుస్తోంది. సాధారణ రోజులతో పోల్చుతే ప్రస్తుతం స్పెషల్ బస్సుల్లో ఛార్జీలు 50 శాతం అదనంగా వసూలు చేస్తోంది ఆర్టీసీ. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి విజయవాడ, ఖమ్మం, కరీంనగర్, సత్తుపల్లికి వెళ్లే స్పెషల్ బస్సుల్లో ఈ చార్జీలు అమల్లో ఉండనున్నట్టు ఆర్టీసీ పేర్కొంది. అలాగే డీలక్స్, సూపర్‌లగ్జరీ, రాజధాని బస్సుల్లో.. ఏసీ, ఆర్ నాన్ ఏసీ.. సర్వీస్‌ను బట్టి ఛార్జీలను వసూలు చేస్తోంది ఆర్టీసీ.ప్రస్తుతం పండుగ సీజన్‌లో నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోన్నట్టు ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఈ సర్వీసుల్లో ఛార్జీలను సవరిస్తున్నట్టు ఆర్టీసీ పేర్కొంది. 2003లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు (+ూ వీం. చీశీ. 16) ప్రకారం, ఈ సర్వీసుల ఛార్జీలను సవరించినట్టు పేర్కొంది. పండుగ సమయాల్లో నడిపే ప్రత్యేక బస్సులకు సాధారణ ఛార్జీల కంటే గరిష్టంగా 50 శాతం వరకు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్టు ఈ జీవోలో స్పష్టం చేసింది.

# తెలంగాణలో దంచికొడుతున్న వానలు.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

**హైదరాబాద్ :**తెలంగాణపై అల్పపీడన ప్రభావం.. రెండ్రోజులు వర్షాలే ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ గత 24 గంటల్లో పలుచోట్ల రికార్డుస్థాయి వర్షపాతం నమోదు ప్రాజెక్టులకు పెరుగుతున్న వరద నీరు.. అప్రమత్తమైన అధికారులు బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెల ంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుసు ్తన్నాయి. రానున్న రెండ్రోజులు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబా ద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం కూడా ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌తో పాటు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల,



కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో వర్షాలు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది.గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో అత్యధికంగా 9.35 సెం.మీ., ఖమ్మం జిల్లా కారేపల్లిలో 6.5 సెం.మీ. వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో ఏకంగా 13.55 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) గణాంకాలు వెల్లడించాయి.ఈ వర్షాల కారణంగా ఉత్తర తెలంగాణలోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలోని వట్టివాగు, కుమరం భీం ప్రాజెక్టుల్లోకి 2,172 క్యూసెక్కుల వరద వస్తుండగా, అధికారులు 1,378 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో రైతులు, ఉండాలని అధికారులు సూచించారు. ఇక హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# అభిషేక్ శర్మ ఖాతాలో అరుదైన రికార్డు




భారత యువ సంచలనం, విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ ఫార్మాట్‌లో బంతుల పరంగా అత్యంత వేగంగా 6,000 పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. అంతేకాకుండా, ఈ ఘనత సాధించిన మొట్టమొదటి ఆసియా ఆటగాడిగానూ నిలిచాడు.
ఆఫ్ఘనిస్థాన్‌తో ఆదివారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో అభిషేక్ ఈ అరుదైన మైలురాయిని అందుకున్నాడు. తన టీ20 కెరీర్‌లో 6,000 పరుగుల మార్కును చేరుకోవడానికి అతడికి కేవలం 3,420 బంతులు మాత్రమే అవసరమయ్యాయి. ఈ జాబితాలో న్యూజిలాండ్‌కు చెందిన విధ్వంసకర ఓపెనర్ ఫిన్ అలెన్ (3,386 బంతులు) మాత్రమే అభిషేక్ కంటే ముందున్నాడు. ఈ క్రమంలో అభిషేక్ శర్మ.. ఆండ్రీ రస్సెల్ (3,550 బంతులు), టిమ్ డేవిడ్ (3,681 బంతులు), విల్ జాక్స్, ఫిల్ సాల్ట్ (3,857 బంతులు) వంటి మేటి హార్డ్ హిట్టర్లను వెనక్కి నెట్టడం విశేషం.
ఈ రికార్డును అందుకున్న మ్యాచ్‌లోనూ అభిషేక్ తనదైన శైలిలో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆఫ్ఘన్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి, కేవలం 32 బంతుల్లోనే బౌండరీల వర్షం కురిపిస్తూ 82 పరుగులు సాధించాడు. అతని దూకుడైన ఆటతీరుతోనే ఈ రికార్డును మరింత ఘనంగా సొంతం చేసుకున్నాడు.
టీ20 ఫార్మాట్‌లో అత్యంత వేగంగా పరుగులు చేయడం అభిషేక్‌కు కొత్తేమీ కాదు. గతంలో అత్యంత వేగంగా 5,000 పరుగులు పూర్తి చేసిన రికార్డు కూడా అతడి పేరు మీదే ఉంది. తాజా ప్రదర్శనతో పొట్టి ఫార్మాట్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోవడంతో పాటు, భవిష్యత్ స్టార్‌గా తన సత్తాను మరోసారి ప్రపంచానికి చాటాడు.

# ఆసియా కప్ 2027కి 6 జట్లు ఖరారు.. లక్కీ ఛాన్స్ పట్టేసిన నేపాల్ టీం..!




వన్డే ఫార్మాట్‌లో జరగనున్న ఆసియా కప్ 2027 (ూంఖు జబజూ 2027) టోర్నీలో పాల్గొనే మొత్తం 6 జట్ల వివరాలు అధికారికంగా ఖరారయ్యాయి. గతంలో టీ20 ఫార్మాట్‌లో జరిగిన ఈ టోర్నీలో 8 జట్లు బరిలో దిగగా, ఈసారి మాత్రం 6 జట్లకు మాత్రమే అవకాశం లభించింది. బంగ్లాదేశ్ (ఢ్ఖుఅస్త్రశ్రీఖుఎవంష్ర) ఆతిథ్యం ఇవ్వనున్న ఈ టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత క్రికెట్ జట్టు (ంఖుఎ ×అఎఖు) తో పాటు పాకిస్థాన్ ( శ్రీలంక (, అఫ్గానిస్థాన్ (ూటస్త్రఫ్ఖుఅఱ్ఖుఅ) జట్లకు నేరుగా ప్రవేశం దక్కింది. ఈ జాబితాలో ఆఖరి స్థానం కోసం జరిగిన ఏసీసీ ప్రీమియర్ కప్ తుది పోరు అత్యంత ఆసక్తికరంగా సాగింది.మలేషియా లోని బాయుమాస్ ఓవల్ మైదానంలో 10 అసోసియేట్ దేశాల మధ్య ఈ టోర్నీ నిర్వహించారు. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 12 వరకు సాగిన ఈ సిరీస్‌లో నేపాల్ జట్టు ఫైనల్ చేరింది. తుది పోరులో యూఏఈ (ఖూఋజు) జట్టుపై 44 పరుగుల తేడాతో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది.నేపాల్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ ఆసిఫ్ షేక్ అద్భుతమైన సెంచరీతో మెరిశాడు. కెప్టెన్ సందీప్) సారథ్యంలోని ఈ జట్టు స్థిరమైన ప్రదర్శనతో ఆసియా కప్‌లో తన స్థానాన్ని పదిలం చేసుకుంది.నేపాల్ క్రికెట్ చరిత్రలో ఈ టోర్నీకి అర్హత సాధించడం కేవలం రెండోసారి మాత్రమే కావడం విశేషం. సరిగ్గా 2023వ సంవత్సరంలో తొలిసారిగా ఆసియా కప్‌లో అడుగుపెట్టిన ఈ జట్టు, అప్పట్లో భారత్ అలాగే పాకిస్థాన్ జట్లతో తలపడింది.అప్పట్లో ఒక్క మ్యాచ్‌లోనూ విజయం సాధించలేకపోయినప్పటికీ, గడిచిన మూడేళ్ల కాలంలో ఆటతీరును మెరుగుపరుచుకుంది. ఇప్పుడు మరింత అనుభవంతో బరిలోకి దిగుతున్న నేపాల్ జట్టు, అగ్రశ్రేణి జట్లకు గట్టి పోటీ ఇవ్వడానికి సిద్ధమవుతోంది.

# భారత క్రికెట్‌లో సంచలనం.. వయసు మార్చి, దొరికిపోయిన యంగ్ ప్లేయర్.. బీసీసీఐ వేటు





:ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో సిరీస్‌కు సిద్ధమవుతున్న భారత యువ జట్టులో తీవ్ర కలకలం రేగింది. వయసు పెంపుదలలో తీవ్ర అవకతవకలకు పాల్పడినట్లు తేలడంతో యంగ్ క్రికెటర్ రోహిత్ యాదవ్‌ను బీసీసీఐ జట్టు నుంచి తక్షణమే తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ పరిధిలో ఏజ్ గ్రూప్ క్రికెట్ ఆడుతున్న రోహిత్ యాదవ్ వయసు సమాచారంలో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నట్లు అంతర్గత విచారణలో తేలింది. అతడి అసలు వయసుకు, సమర్పించిన ధ్రువీకరణ పత్రాలకు మధ్య ఏకంగా 27 నెలల వ్యత్యాసం ఉన్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ (సిఏబి) గుర్తించింది. జనన ధ్రువీకరణ పత్రంలో పుట్టిన సంవత్సరాన్ని ఏకంగా మూడుసార్లు మార్చినట్లు విచారణాధికారులు ఆధారాలు సేకరించారు. ఇటీవల జరిగిన శ్రీలంక పర్యటనలోనూ రోహిత్ యాదవ్ భారత అండర్-19 జట్టుకు ప్రాతినిధ్యం వహించడం గమనార్హం.
ఈ అవకతవకలపై స్పందించిన బీసీసీఐ జూనియర్ సెలక్షన్ కమిటీ రోహిత్ యాదవ్‌పై కఠిన చర్యలు చేపట్టింది. రాజ్‌కోట్, అహ్మదాబాద్ వేదికలుగా ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరగబోయే వన్డే, మల్టీ-డే సిరీస్‌లకు సెలక్ట్ చేసిన జట్టు నుంచి అతడిని తప్పించింది. రోహిత్ స్థానంలో వన్డే జట్టులోకి సౌరాష్ట్రకు చెందిన ఆర్యన్ సవసానిని, మల్టీ-డే మ్యాచ్‌ల కోసం హర్యానాకు చెందిన తన్మయ్ బలోదాను భారత సెలెక్టర్లు జట్టులోకి ఎంపిక చేశారు. వయసు మోసాలపై బీసీసీఐ జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తుందని మరోసారి స్పష్టం చేసింది.ఆస్ట్రేలియాతో తలపడనున్న భారత సవరించిన జట్లు
సవరించిన భారత అండర్-19 వన్డే జట్టుకు లక్ష్య రాయ్‌చందాని సారథ్యం వహించనుండగా, యశ్‌బర్ధన్ చౌహాన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. ఈ జట్టులో ఆర్యవీర్ సెహ్వాగ్, అన్వయ్ ద్రావిడ్, వి.కె.వినీత్, కుషాగ్ర ఓఝా లాంటి ప్రతిభావంతులైన కుర్రాళ్లు ఉన్నారు. మల్టీ-డే మ్యాచ్‌ల జట్టుకు యశ్‌బర్ధన్ చౌహాన్ కెప్టెన్‌గా, లక్ష్య రాయ్‌చందాని డిప్యూటీగా వ్యవహరిస్తారు. ఈ జట్టులో సాగర్ విర్క్, అయాన్ అక్రమ్, మానవ్ కృష్ణ, ప్రణవ్ రాఘవేంద్ర చోటు దక్కించుకున్నారు.భారత్, ఆస్ట్రేలియా అండర్-19 జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ సెప్టెంబర్ 18న రాజ్‌కోట్‌లోని నిరంజన్ షా స్టేడియంలో ప్రారంభం కానుంది. రెండో వన్డే సెప్టెంబర్ 21న, మూడో వన్డే సెప్టెంబర్ 23న ఇదే మైదానంలో జరుగుతాయి. అనంతరం రెండు మల్టీ-డే (నాలుగు రోజుల) మ్యాచ్‌ల సిరీస్ జరగనుంది. తొలి మల్టీ-డే మ్యాచ్ సెప్టెంబర్ 27 నుంచి రాజ్‌కోట్‌లో, రెండో మ్యాచ్ అక్టోబర్ 5 నుంచి అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరుగుతుంది.

# రూ.1 లక్ష ఎక్స్‌ట్రా పేమెంట్‌తో హోమ్ లోన్ టెన్షన్ కట్.. 30 ఏళ్ల లోన్ 11 ఏళ్లకే పూర్తి!



గృహ రుణ జువీ×లు దీర్ఘకాలికంగా ఉంటాయి. ముఖ్యంగా 20 లేదా 30 సంవత్సరాల కాలపరిమితి ఉన్న రుణాలపై గణనీయమైన మొత్తంలో వడ్డీ ఖర్చవుతుంది. అయితే, మీరు ప్రతి సంవత్సరం రుణంలో అదనంగా రూ.1 లక్ష జమ చేస్తే జువీ×తో పాటు రుణ కాలపరిమితిని గణనీయంగా తగ్గించుకోవచ్చు. దీనిని 8.5% వార్షిక వడ్డీ రేటును ఉపయోగించి లెక్కిస్తే.. ఈ అదనపు రూ.1 లక్షను ప్రతి సంవత్సరం చివరిలో చెల్లించాలి. ఈఎంఐని తగ్గించడానికి బదులుగా, ముందస్తు చెల్లింపు వల్ల కలిగే పూర్తి ప్రయోజనం రుణ కాలపరిమితిని తగ్గించడానికి ఉపయోగపడుతుంది.రూ.20 లక్షల గృహ రుణం: మీకు రూ.20 లక్షల గృహ రుణం ఉండి, మీరు ప్రతి సంవత్సరం అదనంగా రూ.1 లక్ష జమ చేస్తే, 15 సంవత్సరాల రుణాన్ని సుమారు 8 సంవత్సరాల 8 నెలల్లో తిరిగి చెల్లించవచ్చు. అంటే మీరు సుమారు 6 సంవత్సరాల 4 నెలల ముందే రుణ విముక్తి పొందవచ్చు.20 సంవత్సరాల రుణానికి ఈ కాలవ్యవధి సుమారు 10 సంవత్సరాలకు తగ్గుతుంది. అంటే రుణాన్ని సుమారు 10 సంవత్సరాల ముందే తీర్చేయవచ్చు. 30 సంవత్సరాల రుణంపై సంవత్సరానికి అదనంగా రూ.1 లక్ష చెల్లించడం ద్వారా రుణాన్ని సుమారు 11 సంవత్సరాలలోనే తీర్చేయవచ్చు. అంటే ఏకంగా 19 సంవత్సరాల ముందే. రూ.30 లక్షల రుణంపై సంవత్సరానికి రూ.1 లక్ష ముందస్తు చెల్లింపు కూడా గణనీయమైన వ్యత్యాసాన్ని కలిగిస్తుంది. 15 సంవత్సరాల రుణాన్ని సుమారు 10 సంవత్సరాలలోనే తీర్చేయవచ్చు. దీనివల్ల దాదాపు 5 సంవత్సరాలు ఆదా అవుతాయి. 20 సంవత్సరాల రుణాన్ని సుమారు 11 సంవత్సరాల 9 నెలల్లో తిరిగి చెల్లించవచ్చు. 30 సంవత్సరాల రుణాన్ని సుమారు 13 సంవత్సరాల 10 నెలల్లో తిరిగి చెల్లించవచ్చు. దీనితో మొత్తం రుణ చెల్లింపు సమయం సుమారు 16 సంవత్సరాల 2 నెలలకు చేరుతుంది.సంవత్సరానికి రూ.1 లక్షతో ఇంత పెద్ద తేడా ఎందుకు?గృహ రుణ ఈఎంఐలలో సాధారణంగా మొదటి సంవత్సరాలలో వడ్డీ ఎక్కువగా ఉంటుంది. మీరు ప్రతి సంవత్సరం అదనంగా రూ.1 లక్ష జమ చేసినప్పుడు, ఈ మొత్తం నేరుగా చెల్లించాల్సిన అసలు మొత్తాన్ని తగ్గిస్తుంది. ఆ తర్వాతి నెలల్లో తగ్గిన అసలు మొత్తంపై వడ్డీ వసూలు చేస్తారు. ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఫలితంగా మీరు మీ రెగ్యులర్ ఈఎంఐలను చెల్లిస్తూ ఉండటంతో రుణ కాలపరిమితి వేగంగా తగ్గిపోతుంది.అత్యధిక ప్రభావం ఎక్కడ కనిపిస్తుంది?దీర్ఘకాలిక రుణాలలో దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఉదాహరణకు రూ.20 లక్షల 30 సంవత్సరాల రుణంపై సంవత్సరానికి అదనంగా రూ.1 లక్ష చెల్లించడం వల్ల, ఆ రుణాన్ని సుమారు 19

# బిల్లు చెల్లింపును మరచిపోయిన వెంటనే చేయవలసిన పనులు:




విషయంలో చాలా మంది ఈ పొరపాటు చేస్తారు. ఈఎంఐ మొత్తం చిన్న మొత్తమే కదా, ఒక నెల ఆలస్యంగా చెల్లించినా పెద్ద సమస్యేమీ కాదని వారు అనుకుంటారు. డబ్బు కొరత, తేదీని మర్చిపోవడం వంటి కారణాల వల్ల వారు జువీ× మొత్తాన్ని ఆలస్యంగా చెల్లించవచ్చు. కానీ ఈ చిన్న పొరపాటు పెద్ద నష్టాలకు కారణం కావచ్చు. ఇక్కడ నష్టం కేవలం డబ్బును కోల్పోవడం మాత్రమే కాదు. క్రెడిట్ స్కోర్‌లో తగ్గుదల కూడా ఒక పెద్ద నష్టమే. క్రెడిట్ కార్డ్ బిల్లు లేదా లోన్ వాయిదా చెల్లించేటప్పుడు ప్రజలు తరచుగా కేవలం రూ. 500 లేదా రూ. 1,000 వంటి చిన్న మొత్తాలను తేలికగా తీసుకుంటారు.ఇంత చిన్న మొత్తం మన ఆర్థిక పరిస్థితిలో ఏ పెద్ద మార్పు తెస్తుంది? అని చాలా మంది అనుకుంటారు. కానీ మీ 'క్రెడిట్ హెల్త్' విషయానికి వస్తే పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. మీరు చిన్న మొత్తాలను తేలికగా తీసుకుంటే, మీరు తప్పు చేస్తున్నట్లే. ఒక చిన్న అజాగ్రత్త కూడా మీ ఆర్థిక భవిష్యత్తుపై చెడు ప్రభావాన్ని చూపి, మీ క్రెడిట్ స్కోర్‌ను తగ్గించగలదు.చెల్లించాల్సిన మొత్తం కంటే సమయమే ముఖ్యం:బకాయి ఉన్న బిల్లు మొత్తం కంటే అది ఎంతకాలంగా చెల్లించకుండా ఉంది అనేది చాలా ముఖ్యం. మీ చెల్లింపులు ఎంతకాలంగా ఆలస్యం అవుతున్నాయి అన్నదే అత్యంత ముఖ్యమైన అంశం. ఆలస్యంగా చెల్లింపులు చేయడం అలవాటుగా మారితే, అది నేరుగా మీ క్రెడిట్ స్కోర్‌ను తగ్గిస్తుంది. వాస్తవానికి, మీ తిరిగి చెల్లింపుల చరిత్రే మీ ఆర్థిక విశ్వసనీయతను నిర్ణయిస్తుంది. ఇందులో ఏవైనా లోపాలు ఉంటే, బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థల వద్ద మీ విశ్వసనీయత తగ్గుతుంది.భారతదేశంలో నాలుగు ప్రధాన క్రెడిట్ బ్యూరోలు ఉన్నాయి. అవి: ట్రాన్స్‌యూనియన్ సిబిల్, ఎక్స్‌పీరియన్, ఈక్విఫాక్స్, సిఆర్ఐఎఫ్ హైమార్క్. ఈ కంపెనీలు వినియోగదారుల లావాదేవీలు, రుణ తిరిగి చెల్లింపుల రికార్డుల ఆధారంగా మీ క్రెడిట్ స్కోర్‌ను 300 నుండి 900 వరకు నిర్ణయిస్తాయి. చెల్లింపు సమయానికి చేయనప్పుడు ఆ సమాచారం ఈ బ్యూరోలకు నివేదిస్తాయి. దీంతో మీ స్కోర్ తగ్గడం ప్రారంభమవుతుంది.
బిల్లు చెల్లింపును మరచిపోయిన వెంటనే చేయవలసిన పనులు:
మీరు వాయిదా చెల్లింపును మరచిపోతే నష్టాలను నివారించడానికి కొన్ని తక్షణ చర్యలు తీసుకోవాలి. మొదటిది, మీరు బకాయి ఉన్న బిల్లును ఆలస్యం చేయకుండా వెంటనే చెల్లించాలి. దానిని మరుసటి రోజుకు ఎప్పుడూ వాయిదా వేయకూడదు. రెండవది బిల్లు చెల్లించిన తర్వాత ఏవైనా ఆలస్య రుసుములు లేదా జరిమానాలు ఉన్నాయేమో తనిఖీ చేయాలి. ఏవైనా అదనపు రుసుములు ఉంటే, వాటిని మీరు వెంటనే చెల్లించాలి.మూడవ ముఖ్యమైన విషయం ఏమిటంటే చెల్లింపు చేసిన తర్వాత రుణదాత రికార్డులను తనిఖీ చేసి, మీ ఖాతా అప్‌డేట్ అయినట్లు నిర్ధారించుకోవడం. నాలుగవ విషయం ఏమిటంటే ఏవైనా తప్పుడు నమోదులు ఉన్నాయేమో చూడటానికి మీ క్రెడిట్ రిపోర్ట్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం. ఐదవ, అత్యంత ముఖ్యమైన విషయం

# ఇంట్లోనే ఎస్‌బీఐ ఈకేవైసీ చేసుకోవడం ఎలా? ఈ లింక్‌లను మాత్రం క్లిక్ చేయొద్దు




ఎస్‌బీఐ ఖాతాదారులు తమ ఖ్జ (ఖఅశీష్శీబతీ జబరశీఎవతీ) వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం అవసరం. ప్రస్తుతం ఉన్న ఖాతాకు =వ-ఖ్జ అవసరమైతే, బ్యాంక్ బ్రాంచ్‌కు వెళ్లకుండానే అధికారిక ఆన్‌లైన్ మార్గాల్లో ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉంటుంది. అయితే కేవైసీ పేరుతో వచ్చే నకిలీ ూమీలు, వాట్సాప్ మెసేజ్‌ల విషయంలో ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలి. తెలియని లింకులపై క్లిక్ చేయకుండా స్వయంగా ఎస్‌బీఐ అధికారిక యాప్ లేదా వెబ్‌సైట్‌ను మాత్రమే ఉపయోగించడం సురక్షితమని ఎస్‌బీఐ సూచిస్తోందిఒక కుటుంబంలో ఒకటి కంటే ఎక్కువ రేషన్ కార్డులు ఉండవచ్చా?11న స్కూళ్లు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు.. కారణం కొత్త ఇల్లు నిర్మించేటప్పుడు పునాది లెవల్ వరకు ఎంత ఖర్చు ?ఆండ్రాయిడ్ లోగో ఆకుపచ్చ రోబోట్‌లా ఎందుకు ఉంటుంది?
ఎంచుకోండి: అందుబాటులో ఉన్న ఆప్షన్లలో కేవైసీ అప్‌డేట్ కేవైసీ అనే ఆప్షన్‌ను ఎంచుకోండి.అవసరమైన వివరాలు ఇవ్వండి: అవసరమైతే మీను నమోదు చేసి, స్క్రీన్‌పై కనిపించే కేవైసీ వివరాలను పరిశీలించండి. మార్పులు ఉంటే వాటిని అప్‌డేట్ చేయాలి.అవసరమైన పత్రాలు సమర్పించండి: మీ కేవైసీలో ఏ వివరాలను మార్చుతున్నారనే దానిపై ఆధారపడి సంబంధిత పత్రాలను సమర్పించాల్సి రావచ్చు. ధృవీకరించండి: వివరాలను పరిశీలించిన తర్వాత రిక్వెస్ట్‌ను సబ్మిట్ చేసి, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చే ూూతో వెరిఫికేషన్ పూర్తి చేయాలి.
ఎస్‌బీఐ పరిశీలన తర్వాత కేవైసీ అప్‌డేట్: మీరు సమర్పించిన వివరాలను బ్యాంక్ పరిశీలించిన తర్వాత ఖ్జ రికార్డుల్లో అప్‌డేట్ చేస్తుంది.కొన్ని సందర్భాల్లో ఎస్‌బీఐ అధికారిక కేవైసీ అప్‌డేట్ సదుపాయం ద్వారా కూడా మీ వివరాలను గుర్తించి కేవైసీ ప్రక్రియను కొనసాగించవచ్చు. ఇందులో పుట్టిన తేదీ, పాన్, సీఐఎఫ్ నంబర్ లేదా అకౌంట్ నంబర్ వంటి వివరాలతో గుర్తింపు ప్రక్రియ ఉండవచ్చు.ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా..ఎస్‌బీఐ ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ను ఉపయోగించే రిటైల్ కస్టమర్లు అధికారిక ఇంటర్నెట్ బ్యాంకింగ్ పోర్టల్‌లోకి లాగిన్ అయి ఖ్జ లేదా ఖ్జ ఖజూఝ్‌వకు సంబంధించిన ఆప్షన్ కోసం చూడవచ్చు. సాధారణంగా కేవైసీ కోసం అడిగే పత్రాలను సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.:ఏ వివరాలను అప్‌డేట్ చేస్తున్నారనే దానిపై పత్రాల అవసరం ఆధారపడి ఉంటుంది. పత్రాల్లో పాస్‌పోర్ట్, ఓటర్ డ్రైవింగ్ లైసెన్స్ వంటి అధికారిక పత్రాలు ఉన్నాయి.మోసాల విషయంలో జాగ్రత్త:మీకు వంటి మెసేజ్‌లు లేదా ద్వారా వచ్చినా ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దని ఎస్‌బీఐ హెచ్చరిస్తోంది. అలాగే తెలియని లింక్‌పై క్లిక్ చేయవద్దు. ఆ లింక్ ద్వారా మీ లాగిన్ వివరాలు, ూూ, కార్డు వివరాలు లేదా ఇతర బ్యాంకింగ్ సమాచారం దొంగిలించే అవకాశం ఉంటుంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# సంయుక్త మీనన్ బర్త్ డే టీజర్ విడుదల..

## - వీరనారి అవతారం లుక్‌కు ఫిదా అవుతున్న ఫ్యాన్స్!



నిఖిల్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో సంయుక్త, నభా నటేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం దాదాపు రెండేళ్లుగా షూటింగ్ జరుపుకుని ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ఈ రోజు సంయుక్త మీనన్ బర్త్ డే సందర్భంగా 40 సెకన్ల టీజర్ విడుదల చేశారు. ఇందులో వీరనారి పాత్రలో సంయుక్త కనిపించిన తీరు, కత్తి యుద్ధాలు చేసిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.ఇప్పటివరకు గ్లామర్, ఎమోషనల్ పాత్రల్లో కనిపించిన సంయుక్త.. 'స్వయంభు'లో మాత్రం పూర్తి భిన్నమైన అవతారంలో కనిపించబోతున్నట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. 'స్వయంభు' కథ చారిత్రక నేపథ్యంలో సాగనున్నట్లు టీజర్‌ను చూస్తే అర్థమవుతోంది. రాజ్యాలు, అంతర్యుద్ధాలు, ప్రజలను కాపాడేందుకు జరిగే పోరాటాలు, వీరత్వంతో కూడిన సన్నివేశాలతో సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలో సంయుక్త పోషిస్తున్న పాత్రకు కూడా కథలో కీలకం కానుంది. చేతిలో కత్తి పట్టుకుని యుద్ధరంగంలో పోరాడుతున్న ఆమె సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీరనారి గెటప్‌లో సంయుక్త లుక్‌కు అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. మరో హీరోయిన్ నభా నటేశ్ కూడా ఈ సినిమాలో యువరాణి పాత్రలో కనిపించనుంది. ఆ మధ్య విడుదలైన టీజర్‌లో ఆమె లుక్ కూడా రాజసం ఉట్టిపడేలా ఉంది. చారిత్రక నేపథ్యానికి తగ్గట్టుగా రూపొందించిన సెట్స్, వస్త్రధారణ, పాత్రల లుక్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. నిఖిల్ కూడా తన కెరీర్‌లో ఇంతకు ముందు చేయని తరహా పాత్రలో కనిపించనున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. భారీ యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగాలకు కూడా సినిమాలో ప్రాధాన్యత ఉన్నట్లు కనిపిస్తోంది. కమెడియన్ సునీల్ ఈ సినిమాలో పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. ఆయన పాత్ర ఎలా ఉండబోతుందనేది ఆసక్తిని కలిగిస్తోంది. చారిత్రక నేపథ్యానికి భారీ యాక్షన్, విజువల్స్, డ్రామాను జోడించి సినిమాను రూపొందించినట్లు కనిపిస్తోంది.



ట్రెడిషనల్ లుక్‌లో అదరగొట్టిన 'బేబి' బ్యూటీ వైష్ణవి చైతన్య..!

# ప్రభాస్ 'ఫౌజీ' వాయిదా?

## 'స్పిరిట్' విడుదలపై పడనున్న ప్రభావం!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న సినిమాల విడుదల తేదీలకు సంబంధించి సోషల్ మీడియాలో తాజాగా రకరకాల ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ' సినిమాను తొలుత డిసెంబర్ 3, 2026న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. అయితే షూటింగ్ మరియు పోస్ట్ ప్రొడక్షన్ పనుల ఆలస్యం కారణంగా ఈ చిత్రాన్ని 2027 మార్చికి వాయిదా వేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. దీనిపై చిత్ర యూనిట్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.అయితే ఒకవేళ 'ఫౌజీ' విడుదల తేదీ మార్చికి మారితే, అది ప్రభాస్ ఇతర సినిమాల షెడ్యూల్‌పై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ నటించనున్న భారీ బడ్జెట్ సినిమా 'స్పిరిట్'ను మార్చి 5, 2027న విడుదల చేసేలా ఇదివరకే షెడ్యూల్ ప్రకటించారు. 'ఫౌజీ' డేట్ మారుతుందనే ప్రచారం నేపథ్యంలో 'స్పిరిట్' విడుదల కూడా వాయిదా పడుతుందనే టాక్ వినిపిస్తోంది. అయితే, దీనిపై ఎలాంటి అధికారిక స్పష్టత లేదు. నిర్మాణ సంస్థల నుంచి తుది నిర్ణయం వెలువడితేనే ఈ డేట్లపై పూర్తి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.




# అలా కనిపించడమే నా లక్ష్యం

కేవలం అందంతో మాత్రమే కాకుండా నటనతో ప్రేక్షకుల మనసుల్ని గెలవాలన్నదే తన లక్ష్యం అంటున్నది కన్నడభామ ఆషికా రంగనాథ్. ఈ గురువారం 'సర్దార్ 2' సినిమా ద్వారా పాన్ ఇండియా ప్రేక్షకులను పలకరించింది ఈ అందాలభామ. పాత్రల ఎంపిక గురించి ఆషికా మాట్లాడుతూ 'సినీరంగంలోకి ప్రవేశించిన రెండుమూడేళ్లకే తెలుగులో అవకాశాలు వచ్చాయిఆ టైమ్‌లో ఎలాంటి పాత్రలను ఎంచుకోవాలో కూడా నాకు తెలియదు. వచ్చిన ప్రతి సినిమాకూ ఓకే చెప్పాను. ఇప్పుడు నాలో పరిపక్వత వచ్చింది. స్టార్ హీరోల పక్కన మెరవడం కంటే, ప్రాధాన్యత ఉన్న పాత్రల్లో నటించడానికే ఆసక్తిగా ఉన్నా. కథ విన్నప్పుడు అందులో నా పాత్ర, ప్రేక్షకులపై దాని ప్రభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని సినిమాలకు ఓకే చెబుతున్నాను. నటించిన ప్రతి సినిమాలోనూ కొత్తగా కనిపించడమే నా లక్ష్యం' అంటూ చెప్పుకొచ్చింది అషికా రంగనాథ్.


## త్రివిక్రమ్ క్రేజీ ప్లాన్..

# తెలుగులోకి 'హనుమాన్ అంశ్'!




ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవితం ఆధారంగా తెరకెక్కిన సంచలన చిత్రం 'హనుమాన్ అంశ్' బాలీవుడ్‌లో కలెక్షన్లతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. అయితే ఇంతటి ఘనవిజయం సాధించిన సినిమా తెలుగులోకి రాబోతున్నట్లు తెలుస్తుంది. హిందీ బెల్ట్‌లో ఘన విజయం సాధించి ప్రేక్షకాదరణ పొందిన ఈ చిత్రాన్ని, టాలీవుడ్ ప్రముఖ అగ్ర దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెలుగులో విడుదల చేసే బాధ్యతలను తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని చిత్ర నిర్మాత నమ్రత సింగ్ స్వయంగా వెల్లడించారు. భక్తి, దైవిక అంశాలతో రూపొందిన ఈ బయోపిక్ డ్రామాను తెలుగులోనూ అదే స్థాయిలో విజయవంతం చేసేందుకు త్రివిక్రమ్ చొరవ తీసుకోవడం విశేషం. తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ భక్తి చిత్రాలను విశేషంగా ఆదరిస్తుంటారు కాబట్టి, 'హనుమాన్ అంశ్' తెలుగు వెర్షన్‌పై అటు ఆధ్యాత్మిక వర్గాల్లో, ఇటు సినీ పరిశ్రమలో భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక విడుదల తేదీ వెలువడనుంది.

# డిసెంబర్‌లో వస్తున్న వృషకర్మ



నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'. కార్తీక్ దండు దర్శకుడు. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మాతలు. మైథాలజీ, మిస్టరీ, థ్రిల్లర్ అంశాల కలబోతగా భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ చిత్రంలో నాగచైతన్య ట్రెజర్ హంటర్‌గా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారు. ఆయన మేకోవర్ సరికొత్తగా ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉందని, అత్యుత్తమ ప్రమాణాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని మేకర్స్ తెలిపారు. మీనాక్షి చౌదరి, స్పర్శ్ శ్రీవాస్తవ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ బి లోకనాథ్, దర్శకత్వం: కార్తీక్ దండు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613